

కవలలకు ఉద్యోగ నియామక పత్రాలు అందిస్తున్న కుమారస్వామి

తదుపరి ముఖ్యమంత్రి నేనే!

కుమారస్వామి విశ్వాసం

మండ్య, న్యూస్‌టుడే : 'చూస్తూ ఉండండి.. తదుపరి ముఖ్యమంత్రిని నేనే. నేను జోతిష్యుడిని కాదు. అయినా. చెబుతాను. ప్రజలందరూ కోరుకుంటే ముఖ్యమంత్రిని ఎందుకు అవ్వను? నాకూ ముఖ్యమంత్రిగా ఐదేళ్ల అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరుతా..' అని మాజీ ముఖ్యమంత్రి, కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి వ్యాఖ్యానించారు. 'మండ్య టూ ఇండియా' పేరిట నిర్వహించిన ఉద్యోగమేళా ముగింపు కార్యక్రమంలో ఉద్యోగాలు లభించిన కొందరు యువతకు శనివారం సాయంత్రం ఆయన నియామక పత్రాలు అందజేశారు. శిరూరులో కొండ చరియలు కూలి చనిపోయిన హోటల్ యజమాని జనార్దన నాయక్ కుమార్తె కృతికా నాయక్‌కు బీహెచ్‌ఈఎల్‌లో ఉద్యోగాన్ని ఇప్పించారు. కవలలు నవ్య- నందితకు టాటా మోటార్స్‌లో ఉద్యోగం లభించింది. దివ్యాంగుడు అజయ్ కుమార్‌కు అలోరికా గ్లోబల్ బీపీఓలో ఉద్యోగం లభించింది. వారికి నియామకపత్రాలు వితరణ చేశాక.. విలేకరులతో మాట్లాడారు. భాజపాకు రెండు నియోజకవర్గాలు విడిచి పెట్టామని, తమ పార్టీకే చెన్నపట్టణను కేటాయించాలని కోరుతున్నామని చెప్పారు. భాజపా ఆశీస్సులతోనే కుమారస్వామి రాజకీయాల్లో కొనసాగుతున్నారని బసనగౌడ పాటిల్ యత్నాళ్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ఆయన మాటలను తనతో పాటు భాజపా కూడా పట్టించుకోవడం లేదని ఎద్దేవా చేశారు. పేదలు, మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు అవకాశం కల్పించవలసిన ప్రభుత్వం గ్యారంటీల పేరిట వారిని శక్తిహీనులను చేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో ప్రభుత్వాన్ని కూలదోయవలసిన అవసరం లేదని, కాంగ్రెస్‌లో పలువురు ఎమ్మెల్యేలు ప్రభుత్వ పాలనపై సంతృప్తిగా లేరని వ్యాఖ్యానించారు.



సిద్ధు- డీకే నాయకత్వానికి పరీక్ష

ముప్పేటా ఆటుపోట్లు

ఉపసమరంలో ఎవరిదో పైచేయి

ఈనాడు, బెంగళూరు : విధానసభలో ఖాళీగా ఉన్న మూడు నియోజకవర్గాల నుంచి సభ్యుల ఎన్నికకు ఉప సమరం.. ఈ ఎన్నికల్లో ఫలితం ఏదైనా ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో పెద్దగా మార్పు కనిపించదు. అదే సమయంలో పార్టీలు, వాటిని పర్యవేక్షించే నాయకులకు ఇదో పరీక్షగా మారనుంది. లోక్‌సభ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో నిర్వహించే ఎన్నికలు కావటంతో ప్రతి క్షేత్రాన్ని దక్కించుకునేందుకు నేతలు శక్తినంతా క్రోడీకరిస్తున్నారు. ఈ మూడు క్షేత్రాలూ.. మూడు పార్టీల ప్రభావానికి ప్రతీకలుగా ఉంటున్నాయి. పాత మైసూరు ప్రాంతమైన చెన్నపట్టణలో జేడీఎస్, మధ్య కర్ణాటక శిగ్గావ్‌లో భాజపా, కల్యాణ కర్ణాటకలోని సండూరులో కాంగ్రెస్- వరుసగా గెలుపు సాధిస్తూ వస్తున్నాయి. వీటిని మళ్లీ తమ వశం చేసుకోవాలని మూడు పార్టీలు శక్తివంచన లేకుండా శ్రమిస్తున్నాయి. మూడు ఐదు రోజుల్లో నామినేషన్లకు తుది గడువు ముగియనున్నా ఇంత వరకు అభ్యర్థుల ఖరారు కొనసా..గుతూనే ఉంది. ఎవరికి ఎవరు ప్రత్యర్థులో తేలకున్నా మేమే అభ్యర్థిగా భావించి గెలిపించాలని మూడు పార్టీల కీలక నేతలు ప్రకటిస్తున్నారు. ఆయా పార్టీల నాయకులు నియోజకవర్గ పరిధిలో జిల్లా నాయకులతో చర్చిస్తూ ఓట్ల వేటకు సిద్ధం చేస్తున్నారు.

విమర్శలకు కళ్లెం..

ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అవినీతి ఆరోపణలతో తల్లడిల్లుతోంది. వాల్మీకి గిరిజన సంక్షేమ మండలి నిధుల దుర్వినియోగం, ముడా స్థలాల అక్రమాలు ఈ పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించేవే. మరోవైపు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కుటుంబ సభ్యులు దక్కించుకున్న కేఐఏడీబీ స్థలాల వివాదం విపక్షాల నోళ్లకు పని చెప్పే అంశం. నేడు ఏ విపక్ష నేత నోరు విప్పినా ఈ మూడు అంశాల చుట్టే వ్యాఖ్యానాలుంటాయి. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రాజీనామా, ముడా దాఖలాలు మార్చినట్లు ఆరోపణలు ఎదుర్కొనే మంత్రి భైరతి సురేశ్‌ను అరెస్టు చేయాలనే డిమాండ్లతో విపక్షాలు నిత్యం అధికార పక్షంపై విరుచుకుపడుతున్నాయి. ముఖ్యమంత్రికి ఏ క్షణంలోనైనా లోకాయుక్త, ఈడీ పోలీసుల నుంచి నోటీసులు వస్తాయన్న భీతితో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఉప ఎన్నికల్లో మూడింట మూడు స్థానాలను దక్కించుకుంటే ఈ ఆరోపణల నుంచి కాస్త ఉపశమనం దొరికినట్లే. అందులో కీలకమైన చెన్నపట్టణను గెలిపించుకునే బాధ్యత పూర్తిగా ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ పైనే ఉంది. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో సోదరుడిని గెలిపించుకోలేకపోయిన డీకే.. చెన్నపట్టణను కాంగ్రెస్ వశం చేసుకుంటేనే తన నాయకత్వ సత్తాను చాటుకోగలుగుతారు. అభ్యర్థి విషయంలో మిత్రపక్షాలు మల్లగుల్లాలు పడుతుండగా.. వారి మధ్య పొత్తులను లబ్ధి చేసుకునే అవకాశం కోసం డీకే సోదరుడు ఎదురుచూస్తున్నారు. సండూరులో హస్తపాస్ బలంగా ఉంది. అక్కడ గాలి జనార్దనరెడ్డి చురుకుగా వ్యూహాలు పన్నుతున్నట్లు సమాచారం. ఆయనకు ధీటుగా మొన్నటికి మొన్న జైలు నుంచి బయటకు వచ్చిన మాజీ మంత్రి బి.నాగేంద్ర, ఎమ్మెల్యేలు నారా భరత్‌రెడ్డి, గణేశ్, తుకారామ్ సేవలను వినియోగించుకోవాలని కాంగ్రెస్ చూస్తోంది. మధ్య కర్ణాటకలోని శిగ్గావ్‌లో భాజపా పార్టీ బలంగా ఉన్నా జిల్లా నాయకులను సమన్వయం చేయటంలోనే కాంగ్రెస్ గెలుపు ఆధారపడి ఉంది.


కొత్త నేతలకు పరీక్ష

సరిగ్గా లోక్‌సభ ఎన్నికలకు రెండు నెలల ముందే భాజపా రాష్ట్రాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన బి.వై.విజయేంద్ర, విపక్ష నేత ఆర్.అశోక్‌లకు ఈ ఎన్నికలు పరీక్షగా మారాయి. లోక్‌సభ ఎన్నికల్లో జాతీయ నేతల ప్రభావంతో నెట్టుకు రాగలిగిన ఈ ఇద్దరు నేతలూ.. ఈ ఎన్నికల్లో పూర్తిగా బాధ్యత వహించాలి. యడియూరప్ప ఎలాగూ పార్టీ నాయకుల్లో సమన్వయం కుదుర్చగలిగినా ఆయన సూచనలను అనుసరించే పరిస్థితి నేడు కరవైంది. మిత్రపక్షం జేడీఎస్‌తో కలిసి ప్రయాణించటం భాజపాకు సవాలుగా మారింది. చెన్నపట్టణ సీటును దక్కించుకునేందుకు ప్రయాస పడుతున్న భాజపాకు పాత మైసూరులో పార్టీ కార్యకర్తలకు బదులివ్వలేని పరిస్థితిలో ఉంది. పొరపాటున ఈ సీటు జేడీఎస్‌కు దక్కితే గెలిచే సత్తా ఉన్న సి.పి.యోగేశ్వర్ నుంచి అసమ్మతిని తట్టుకోవటం భాజపాకు కష్టతరమే. మరోవైపు కాంగ్రెస్ నుంచి గట్టిపోటీ ఎదుర్కొనే సండూరులో జిల్లా కీలక నేత బి.శ్రీరాములు ఓటమి భారంతో కుంగిపోతూ పార్టీకి అంటీ ముట్టనట్లుగా ఉన్నారు. ఈ సమయంలో గాలి జనార్దనరెడ్డి సాయాన్ని కోరుతున్న భాజపా ఆయనపైనే ఆధారపడుతోంది. ఇప్పటి వరకు ఈ స్థానంలో భాజపా అభ్యర్థి గెలిచింది లేదు. జేడీఎస్‌తో పొత్తున్నా ఈ క్షేత్రంలో ఆ పార్టీ ప్రభావం అంతంతే. శిగ్గావ్‌లో బసవరాజ బొమ్మై నాయకత్వం భాజపాకు శ్రీరామరక్ష.



విజ్జి- అశోక్ సాధనలపై అందరి దృష్టి

కుమారకు దారేది?



ఈసారి.. జేడీఎస్ పోటీ చేయదగిన ఏకైక క్షేత్రం చెన్నపట్టణ ఒక్కటే. నిత్యం అధికార పక్షంపై ఏదో ఒక అంశంతో విమర్శలతో దండెత్తే దళపతి కుమారస్వామి కీలక పాత్ర పోషిస్తున్నారు. కేవలం ఈకారణంగానే భాజపా అగ్రనేతలు కుమార మాటకు విలువ ఇస్తున్నారన్నది కొట్టిపారేయలేని వాస్తవం. చెన్నపట్టణంలో అభ్యర్థి ఎంపిక కూడా కుమారస్వామికి వదిలేశారు. మొన్నటి వరకు జేడీఎస్ కోర్ కమిటీ అధ్యక్షుడు జి.టి.దేవేగౌడ నాయకత్వం పార్టీకి ఉపయోగపడుతుందని ఆశించేలోగా ముడా వ్యవహారంలో సిద్ధరామయ్యకు మద్దతిచ్చి పార్టీకి కానివారయ్యారు. ఇక యువ నాయకుడు నిఖిల్ కుమారస్వామి నాయకత్వంపై ఇప్పటికిప్పుడే ఆధారపడే స్థితిలో కార్యకర్తలు లేరు. వయోభారంతో అడుగు వేయలేని దేవేగౌడ ఈ ఉప ఎన్నికల్లో వ్యూహాలు కూడా రచించలేదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కుమారస్వామి నాయకత్వం ఈ ఉప ఎన్నికల్లో భాజపాకు కూడా ఎంతో అవసరంగా మారింది.

శిగ్గావ్‌లో భరత్.. సండూరులో బంగారు!

ఈనాడు, బెంగళూరు : ఉప ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల వివరాలను భాజపా జాతీయ ఎన్నికల విభాగం శనివారం ప్రకటించింది. శిగ్గావ్‌లో మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత ఎంపీ బసవరాజ బొమ్మై కుమారుడు భరత్ బొమ్మైకు టికెట్ ఇవ్వగా.. బళ్లారి జిల్లా సండూరులో పార్టీ రాష్ట్ర ఎస్టీ మోర్చా అధ్యక్షుడు బంగారు హనుమంతుకు టికెట్ ఖరారు చేశారు. వీరిద్దరూ తొలిసారిగా ప్రత్యక్ష రాజకీయాల్లో పోటీ చేస్తుండటం గమనార్హం. భరత్ బొమ్మైకి రాజకీయ కుటుంబ నేపథ్యం ఉండగా.. బంగారు హనుమంతుకు అలాంటిదేమీ లేదు. చెన్నపట్టణలో అభ్యర్థి ఎవరో ఇంకా తేలాల్సి ఉంది.

విద్యావంతుడు.. భరత్



భరత్ బొమ్మై

భరత్ బొమ్మై.. ఉన్నత చదువుల తర్వాత పారిశ్రామికవేత్తగా రాణించారు. ఎస్.ఆర్.బొమ్మై కుటుంబంలో మూడో తరం నేతగా రాజకీయాల్లో అడుగుపెట్టిన భరత్ బొమ్మై సింగపూర్‌లో ఎంబీఏ, అమెరికాలో ఉన్నతవిద్య పూర్తి చేశారు. ఇదివరకు ఆయన ఏనాడూ రాజకీయాలపై ఆసక్తి చూపలేదు. తన తండ్రి బసవరాజ బొమ్మై ముఖ్యమంత్రిగా ఏడాదిన్నర పాటు పని చేసినా ఏనాడూ రాజకీయ వేదికల్లో కనిపించలేదు. కుమారుడిని రాజకీయాల్లోకి రానివ్వనని పదే పదే చెబుతున్న బసవరాజ బొమ్మై టికెట్ ప్రకటించే ఓ రోజు ముందు వరకూ అధిష్ఠానంతో ఇదే మాట చెప్పారు. శనివారం దిల్లీలోనూ ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. హావేరి జిల్లాలో భాజపాకు బొమ్మై కుటుంబం మినహా మరో పేరున్న నేత లేకపోవటంతో అనివార్యంగా భరత్ బొమ్మైకు అవకాశం దక్కింది. బసవరాజ బొమ్మై లోక్‌సభ ఎన్నికల్లోనూ అయిష్టంగానే పోటీ చేసిన విషయం తెలిసిందే. తండ్రిలాగానే భరత్ బొమ్మై బరిలో నిలుస్తున్నారు. ప్రస్తుతం ఆటోటెక్ ఇంజినీర్స్, వాల్‌టెక్ కార్పొరేషన్, ఇండస్ట్రీస్, అశ్వ ఎనర్జీ, మ్యాగ్నటెక్ ఇంజినీర్స్, ప్రభంజన్ అప్పరెల్స్, బ్లేజ్ ఫార్మా వంటి కంపెనీలతో విజయవంతమైన పారిశ్రామికవేత్తగా రాణిస్తున్నారు.

తెరపై నుంచి..



బంగారు హనుమంత

కన్నడ సినిమా పరిశ్రమలో ఉత్తర కర్ణాటకకు అంతగా ప్రాతినిధ్యం లేదన్న ఒకే ఒక కారణంతో చలన చిత్ర రంగంలో అడుగుపెట్టిన 42 ఏళ్ల బంగారు హనుమంతు నటుడిగా, నిర్మాతగా, గుత్తేదారుగా, సామాజిక సేవల్లోనూ రాణించారు. మూడు సినిమాల్లో నటించిన ఆయన విజయనగరం జిల్లా కూడ్లిగికి చెందినవారు. ప్రస్తుతం భాజపా రాష్ట్ర ఎస్టీ మోర్చా అధ్యక్షుడిగా ఉన్న హనుమంతు బీఏ, బీఈడీ చదివారు. ఓ వైపు వ్యవసాయ పనులు, సినిమా రంగంలో ఉంటూనే 2004లో భాజపాలో కార్యకర్తగా రాజకీయాల్లో అడుగుపెట్టారు. మండల, జిల్లా స్థాయిలో ఎస్టీ విభాగ బాధ్యతలు చేపట్టి.. 2023లో రాష్ట్ర ఎస్టీ మోర్చాకు అధ్యక్షుడయ్యారు. విధానసభ, లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి శ్రమించిన హనుమంతు స్థానికంగా విద్యా, వ్యాపార, సామాజిక సేవల్లో చురుకుగా పాల్గొనేవారు. 2023లో కూడ్లగి నుంచి టికెట్ ఆశించి భంగపడిన ఆయన బి.శ్రీరాములుపై వ్యతిరేకత చాటారు. ఈసారి శ్రీరాములు కూడా ఆశించిన సండూరు స్థానం నుంచి టికెట్ పొంది అదృష్ట పరీక్షకు సిద్ధమయ్యారు.

నోరు పారేసుకున్న యత్నాళ్



హుబ్బళ్లి, న్యూస్‌టుడే : 'మహాత్మా అని పిలవడం తప్పు. కేవలం గాంధీ అని మాత్రమే ఆయనను పిలవాలి' అంటూ కేంద్ర మాజీ మంత్రి, ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ శనివారం హుబ్బళ్లిలో అనుచిత వ్యాఖ్యలు చేశారు. గాంధీ, నెహ్రూ, వారి వారసులే ఈ దేశాన్ని పాడు చేశారంటూ నిప్పులు చెరిగారు. 'వక్ఫ్ ఆస్తి వాళ్ల నాయనదా?' అని మంత్రి జమీర్‌ను ఉద్దేశించి ప్రశ్నల వర్షాన్ని గుప్పించారు. మొగలులు, వారి వంశస్థులంతా... అంటూ బూతులు తిట్టడంతో విలేకరులు, అక్కడ ఉన్న వారంతా నిర్ఘాంత పోయారు. ఈ దేశం రాముడు, పాండవులు, హిందువులదని స్పష్టం చేశారు. ఇస్లాం ధర్మం మొదటి నుంచి లేదని టిప్పు, ఆదిల్‌షాహి, ఔరంగజేబ్, ఇప్పుడు జమీర్ అహ్మద్ ఖాన్.. అంటూ విమర్శలు గుప్పించారు.

వీడని ముడా నీడ

కొనసాగిన సోదాలు, విచారణ



ముడా కార్యాలయం ముంగిట తనిఖీలు

మైసూరు, న్యూస్‌టుడే : మైసూరు అభివృద్ధి ప్రాధికార (ముడా)లో అక్రమాలపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారుల సోదాలు శనివారం నాడూ కొనసాగాయి. శుక్రవారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు సోదాలకు కాస్త విరామం ఇచ్చి.. శనివారం వేకువజాము నుంచే మళ్లీ పని మొదలుపెట్టారు. వివిధ విభాగాల ఉద్యోగులు, అధికారుల విచారణ కొనసాగించారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య భార్యకు ఆమె సోదరుడు మల్లికార్జున స్వామి పసుపు కుంకుమ కింద భూమిని అప్పగించడం, అంతకు మునుపు భూమి యజమాని దేవరాజ్ తన పొలాన్ని విక్రయించడం, తనకు వచ్చిన భూమిని ముడాకు పార్వతి అందించడం తదితరాలకు సంబంధించిన దస్త్రాలను ప్రత్యేకంగా పరిశీలించారు. భూమి విక్రయించిన దేవరాజ్‌ను సుదీర్ఘంగా ప్రశ్నించారు. చివరకు ఆయనకు కరచాలనం చేసి పంపించారు. కొన్ని దాఖలాలను వైట్‌నర్‌తో సరిదిద్ది ఉన్నట్లు ఈడీ అధికారులు గుర్తించారు. ముడా కమిషనర్ రఘునందన్ నుంచి అధికారులు వివరణ తీసుకున్నారు. ముడాలో 1992వ ఏడాదికి సంబంధించిన కొన్ని దస్త్రాలు మాయం అయినట్లు గుర్తించారు. ముడాలో అక్రమాలపై చేపట్టిన దర్యాప్తు, ఇంటి స్థలాల కేటాయింపునకు సంబంధించి 41 ప్రశ్నలను రఘునందన్‌పై సంధించారు. పార్వతికి కేటాయించిన 14 ఇంటి స్థలాలపైనే ఎక్కువ ప్రశ్నలు అడిగారని సమాచారం.

తుంగభద్రకు పోటెత్తిన వరద



పది గేట్ల గుండా నది వైపు జలాల పరుగు

హొసపేటె, న్యూస్‌టుడే: తుంగభద్రకు వరద పోటెత్తింది. జలాశయం ఎగువ ప్రాంతాలతో పాటు స్థానికంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వస్తున్న వరద ప్రమాణం శనివారం 73,241 క్యూసెక్కులకు చేరుకుంది. ఈ నేపథ్యంలో అధికారులు ముందు జాగ్రత్తగా జలాశయం పది గేట్లు పైకెత్తి సుమారు 74,025 క్యూసెక్కులను నదికి విడుదల చేశారు. ప్రస్తుతం వస్తున్న వరద ప్రవాహం మరో వారం రోజులు కొనసాగే అవకాశమున్నట్లు ఇంజినీర్లు అంచనా వేస్తున్నారు. డ్యాం నీటిమట్టం 1633 అడుగులు కాగా ప్రస్తుతం 1631 అడుగుల నిల్వ ఉంది.

పోలీసుల అదుపులో గోపాల జోషి?

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : లోక్‌సభ ఎన్నికల్లో భాజపా టికెట్ ఇప్పిస్తామని మాజీ ఎమ్మెల్యే దేవానంద్ ఫూల్‌సింగ్ చౌహాన్ నుంచి రూ.2 కోట్లు తీసుకుని వంచించిన ఆరోపణలపై ఇద్దరిని బసవేశ్వరనగర ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. అథణి ఇంజినీరు సోమశేఖర నాయక్, బసవేశ్వరనగర నివాసి విజయకుమారిని నిందితులుగా ప్రకటించారు. కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి అన్న గోపాలజోషి, వారి సమీప బంధువు అజయ్ జోషి ఇప్పటికీ పరారీలోనే ఉన్నారని పోలీసులు తెలిపారు. స్నేహితుడి నివాసంలో తలదాచుకున్న గోపాలజోషిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారని సమాచారం. ఆ విషయాన్ని అధికారికంగా ధ్రువీకరించలేదు. తన అన్నకు- నాకు మధ్య 32 ఏళ్లుగా ఎటువంటి సంబంధాలు లేవని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి ఇప్పటికే స్పష్టం చేశారు. తన పేరును వినియోగించుకుని వంచనకు పాల్పడుతున్న సోదరునిపై 2013 లోనే న్యాయస్థానంలో దావా వేశానని, ఈ విషయాన్ని ఎన్నికల ప్రమాణ పత్రంలోనూ పొందుపరిచానని గుర్తు చేశారు.

'జోషికి సంబంధం లేదు'

హుబ్బళ్లి, న్యూస్‌టుడే : తన భర్తకు భాజపా ఎంపీ టికెట్ ఇస్తానని గోపాల్ జోషి నగదు తీసుకుని వంచించారని, దానికీ, కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి సంబంధం లేదని మాజీ ఎమ్మెల్యే చౌహాన్ భార్య సునీత స్పష్టం చేశారు. నిందితుడు ప్రహ్లాద్ జోషికి సోదరుడని, వారిద్దరి మధ్య కొన్నేళ్లుగా ఎటువంటి సంబంధాలు కూడా లేవని తమకు తెలుసని విలేకరులతో తెలిపారు. టికెట్ ఇప్పించకుండా, తీసుకున్న నగదు ఇవ్వకపోవడంతో అనివార్య పరిస్థితుల్లో తాము పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

సెల్‌ఫోన్ వద్దన్నందుకు విద్యార్థిని బలవన్మరణం

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : సెల్‌ఫోన్లో ఎక్కువ సమయం గడపడం మాని చదువుకోవాలని తల్లి మందలించడంతో శ్రావ్య (19) అనే విద్యార్థిని ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. చామరాజపేటకు చెందిన శ్రావ్య స్థానిక కళాశాలలో మొదటి ఏడాది బీబీఎం విద్యార్థిని. చదువుకోవాలంటూ తల్లి మందలించడంతో తన గదిలో శుక్రవారం రాత్రి ఆత్మహత్య చేసుకుంది.

మత్తు వీడని కొడుకును కడతేర్చిన తండ్రి

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : నిత్యం మద్యం తాగి ఇంటికి వచ్చి గొడవ చేస్తున్న రాజేశ్ (36) అనే యువకుడిని అతని తండ్రి లింగప్ప (64) శుక్రవారం రాత్రి హత్య చేశాడు. నాగదేవనహళ్లిలో ఉంటున్న లింగప్పను కెంగేరి ఠాణా పోలీసులు శనివారం ఉదయం అరెస్టు చేశారు. సంపాదన మొత్తం మద్యం తాగేందుకే ఖర్చు చేస్తున్నావని కుమారునితో ఆయన గొడవకు దిగారు. తనపై గొడవకు వస్తున్న రాజేశ్‌ను తోయడంతో కిందపడ్డాడు. చేతికి అందిన తాడు తీసుకుని గొంతుకు ఉరి బిగించి హత్య చేశాడని డీసీపీ గిరీశ్ తెలిపారు.

బెళగావిలో రూ.2.73 కోట్ల అక్రమ సొమ్ము స్వాధీనం

బెళగావి, న్యూస్‌టుడే : ఎటువంటి దాఖలాలు లేకుండా గూడ్సు వాహనంలో తరలిస్తున్న రూ.2.73 కోట్ల నగదును సీసీబీ పోలీసులు జప్తు చేసుకుని, ముగ్గురిని అరెస్టు చేశారు. మహారాష్ట్ర లోని సాంగ్లి నుంచి హుబ్బళ్లికి నగదు తీసుకువస్తున్న సచిన్ మేనకుదళ, మారుతి మారగుడెతో పాటు గూడ్సు ఆటో డ్రైవరును బంధించామని బెళగావి డీసీపీ రోహన్ జగదీశ్ తెలిపారు. నగదు తరలించేందుకు ఆటో క్యాబిన్‌ను ప్రత్యేకంగా డిజైన్ చేయించుకున్నారని గుర్తించారు.

హుబ్బళ్లిలో అంజలి కుటుంబానికి సాయం

హుబ్బళ్లి: తనకు పరిచయం ఉన్న గిరీశ్ సావంత అనే యువకుని చేతిలో గత మే 15న హత్యకు గురైన యువతి అంజలి అంబిగెర (20) కుటుంబానికి ప్రభుత్వం రూ.5 లక్షల పరిహారాన్ని అందజేసింది. ధార్వాడ జిల్లాధికారి ఖాతాకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి పరిహారాన్ని విడుదల చేశామని ముఖ్యమంత్రి కార్యదర్శి టీపీ గోపాల్ తెలిపారు.

మునిరత్నపై మరో ఫిర్యాదు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : మహిళపై అత్యాచారానికి పాల్పడిన ఆరోపణలు ఎదుర్కొంటున్న రాజరాజేశ్వరినగర ఎమ్మెల్యే మునిరత్నపై భాజపా ఎమ్మెల్సీ తులసి మునిరాజు తాజాగా ఫిర్యాదు చేశారు. అసెంబ్లీకి 2018 ఎన్నికల్లో ఆయన నకిలీ ఓటరు గుర్తింపు కార్డులు సృష్టించారని, తాను జాలహళ్లి ఠాణాలో కేసు పెట్టానని, ఉన్నత న్యాయస్థానం ఆదేశించినా, కేసు దర్యాప్తును పక్కదారి పట్టించారని తులసీ మునిరాజు ఆరోపించారు. తనను బెదిరించి కేసు వెనక్కు తీసుకునేలా చేశారంటూ నగర పోలీసు కమిషనర్, పోలీసు డైరెక్టర్ జనరల్‌కు శనివారం ఫిర్యాదు చేశారు.

'వర్గీకరణ' సాధ్యమేనా?



ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణపై మంత్రులు, శాసనసభ్యులతో సమావేశమైన ముఖ్యమంత్రి సిద్ధరామయ్య

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : రాష్ట్రంలో షెడ్యూల్డు కులాల రిజర్వేషన్ వర్గీకరణ అమలు సాధ్యతపై ముఖ్యమంత్రి సిద్ధరామయ్య శనివారం సంబంధిత మంత్రులు, శాసనసభ్యులతో ప్రత్యేకంగా సమావేశమై చర్చించారు. రాష్ట్రంలో ఈ రిజర్వేషన్‌ను వర్గీకరించాలనే ఒత్తిడి ఎదురవుతోన్న క్రమంలో సమావేశానికి ప్రాధాన్యమేర్పడింది. ఆగస్టు ఒకటో తేదీ సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు, జస్టిస్ సదాశివ కమిషన్ నివేదిక, కులాల సర్వే తదితర అంశాలూ చర్చకు వచ్చాయి. రిజర్వేషన్లను ఎలా వర్గీకరించాలి, దాని వల్ల లాభనష్టాలనూ సీఎం విశ్లేషించారు. సమావేశంలో మంత్రులు కె.హెచ్.మునియప్ప, ఆర్.బి.తిమ్మాపుర, మాజీ ఎంపీ డాక్టర్ ఎల్. హనుమంతయ్య, మాజీ మంత్రులు హెచ్.ఆంజనేయ, శివణ్ణ, శాసనసభ్యులు బసంతప్ప, డాక్టర్ తిమ్మయ్య, ముఖ్యమంత్రి రాజకీయ కార్యదర్శి నసీర్ అహ్మద్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలిని రజనీశ్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న విజయేంద్ర

సిద్ధు.. జగమొండి: విజయేంద్ర

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మొండితనాన్ని వీడి లోకాయుక్త అధికారుల విచారణకు హాజరవ్వాలని భాజపా రాష్ట్రాధ్యక్షుడు బీవై విజయేంద్ర హితవు పలికారు. దిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ అధ్యక్షుడు కేజ్రీవాల్ ఇలానే మొండిగా వ్యవహరించి, చివరకు కారాగారానికి వెళ్లవలసి వచ్చిందని గుర్తు చేశారు. భాజపా ప్రధాన కార్యాలయం 'జగన్నాథ భవన్'లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తనకు కాంగ్రెస్ అధిష్ఠానం మద్దతు ఉందని భావిస్తూ, ముఖ్యమంత్రి పీఠాన్ని అంటిపెట్టుకుని ఉన్నారని తప్పుబట్టారు. మైసూరు నగరాభివృద్ధి సంస్థ (ముడా) అక్రమాలకు సంబంధించిన విచారణను చేపట్టేందుకు చట్టసభ ప్రతినిధుల న్యాయస్థానం, ఉన్నత న్యాయస్థానంలో న్యాయమూర్తులు ఇచ్చిన ఆదేశాలను ఒకసారి క్షుణ్ణంగా చదువుకుంటే, ఒక్క క్షణం కూడా ఆయన పదవిలో కొనసాగరని వ్యాఖ్యానించారు.



విలేకరులతో మాట్లాడుతున్న శోభా కరంద్లాజె

'దస్త్రాలు కాల్చేసిన సురేశ్'

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : ముడాలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు చెందిన అక్రమాలు బయటకు రాకుండా చేసేందుకు నగరాభివృద్ధి శాఖ మంత్రి భైరతి సురేశ్ కొన్ని దాఖలాలను కాల్చివేశారని కేంద్ర మంత్రి శోభా కరంద్లాజె ఆరోపించారు. ఈడీ అధికారులు తక్షణమే ఆయనను అరెస్టు చేసి విచారించాలని డిమాండ్ చేశారు. భాజపా ప్రధాన కార్యాలయం 'జగన్నాథ భవన్'లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. ముడా ప్రధాన కార్యాలయంలో ఈడీ సోదా చేసిన సమయంలో నాలుగేళ్ల దస్త్రాలు కనిపించలేదన్నారు. సురేశ్ స్వయంగా 'ముడా' కార్యాలయానికి వెళ్లి కొన్ని దస్త్రాలు తీసుకువచ్చి కాల్చి వేశారని ఆరోపించారు. అవినీతి ఆరోపణల నేపథ్యంలో నైతిక బాధ్యత వహించి ముఖ్యమంత్రి పదవికి సిద్ధరామయ్య తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ముడాలో పెద్ద అవినీతి తిమింగలాలు ఉన్నాయని విమర్శించారు. ముఖ్యమంత్రి కుమారుడు, ఎమ్మెల్సీ డాక్టర్ యతీంద్ర అందులో సభ్యుడిగా ఉన్నారని, ఆయనే ప్రభావాన్ని చూపించి పలువురికి ఇళ్ల స్థలాలను అక్రమమార్గంలో ఇప్పించారని ఆరోపించారు.

దర్శన్‌పై మరో కేసు

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : సినీనటుడు దర్శన్ రెండేళ్ల కిందట తనకు ఫోన్ చేసి ప్రాణహాని తలపెడతానని బెదిరించాడని యువ నిర్మాత భరత్ ఆరోపించారు. ఆయన కారాగారం నుంచి బయటకు వస్తే తనకు ప్రాణహాని లేకుండా రక్షణ కల్పించాలని కోరుతూ కెంగేరి ఠాణాలో ఫిర్యాదు చేశారు. 'భగవాన్ శ్రీకృష్ణ' పేరిట సినిమా తీసేందుకు ధ్రువన్ అనే నటుడిని ఆయన 2020లో సంప్రదించారు. కరోనా మహమ్మారి వెంటాడటంతో సినిమా నిర్మాణ ప్రయత్నం విరమించుకున్నారు. తనతోనే సినిమా తీయాలని ధ్రువన్ కోరగా.. భరత్ తన సమస్యను ఆయనకు చెప్పారు. ఆ ధ్రువన్ చివరికి దర్శన్ వద్దకు వెళ్లి తనకు ఫోన్ చేయించారని, సినిమా తీయకపోతే 'నువ్వు భూమిపై ఉండవు' అని బెదిరించారని ఆరోపించారు.

ఎట్టకేలకు చిక్కిన కొండముచ్చు

కంప్లి, న్యూస్‌టుడే: కంప్లి తాలూకాలో మెట్రి గ్రామంలో పలువురిపై దాడిచేసి గాయపరిచిన రౌడీ కొండముచ్చును శుక్రవారం సాయంత్రం అటవీ శాఖ అధికారులు బంధించారు. వానరం దాడిలో చాలామంది గాయపడిన సమాచారం అందుకున్న అధికారులు దాన్ని బంధించేందుకు గురువారం బోను ఏర్పాటు చేసినా చిక్కలేదు. ఈ నేపథ్యంలో అటవీ శాఖ అధికారులు బి.రాఘవేంద్ర, నాగరాజ్, పశు వైద్యుడు మహేంద్ర తదితరులు శుక్రవారం కోతికి తుపాకీ ద్వారా మత్తు ఇంజక్షన్ ఇచ్చి పట్టుకోవడంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు.


వలలో వానరం


పట్టుకోవడానికి ముందు ఓ వ్యక్తిని గాయపరిచిన వైనం

వంచకులకు కటకటాలు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : షేరు మార్కెట్‌లో పెట్టుబడుల పేరిట వంచనలకు పాల్పడుతూ తప్పించుకుని తిరుగుతున్న ముగ్గురిని హైదరాబాద్‌లో అరెస్టు చేసి నగరానికి తీసుకువచ్చామని నగర పోలీసు కమిషనర్ దయానంద్ వెల్లడించారు. అమన్, గురుబాయ్, భరత్ భాయ్ అనే వ్యక్తులను నిందితులుగా గుర్తించారు. 'గ్రీన్ బ్లాక్ లిమిటెడ్' అనే కంపెనీ పేర్లపై పెడితే పెద్ద మొత్తంలో రాబడి, లాభాలు వస్తాయని వీరు ప్రచారం చేసుకున్నారని చెప్పారు. హెచ్ఎస్ఆర్ లేఅవుట్‌కు చెందిన ఒక శ్రీమంతుడి నుంచి రూ. 35.35 లక్షల నగదును తమ ఖాతాలకు బదిలీ చేయించుకున్నారని తెలిపారు. బాధితుని ఫిర్యాదుతో దర్యాప్తు చేపట్టి ముగ్గురిని అరెస్టు చేశామన్నారు. పరారీలో ఉన్న ఇతర నిందితుల కోసం పోలీసులు గాలింపు తీవ్రం చేశారు.

గనినాడు అతలాకుతలం

- వర్షాలకు దెబ్బతిన్న 24 ఇళ్లు
- ఉద్యానవన పంటలకు తీవ్ర నష్టం

బళ్లారి, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం బళ్లారి జిల్లాను వణికించింది. మూడు రోజులుగా ఎడతెరిపిలేని వానలతో జిల్లాలో 24 పైగా మట్టి ఇళ్లు కూలిపోగా, వ్యవసాయ, ఉద్యానవన పంటలు తీవ్రంగా నష్టపోయాయి. తేమ శాతం ఎక్కువ కావడంతో మిరపకు నల్లతామర (థ్రిప్స్) తెగులు వ్యాపించి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నెల 1 నుంచి 19వ తేదీ వరకు కురిసిన వర్షాలకు మొత్తం 35 ఇళ్లు పడిపోగా, వాటిలో అల్పపీడనం ప్రభావంతోనే 24 ఇళ్లు కూలినట్లు అధికారుల లెక్కలు తెలియజేస్తున్నాయి. బళ్లారిలో 4, సిరుగుప్ప 3, సండూరు 14, కురుగోడు 1, కంప్లిలో 13 చొప్పున గృహాలు ధ్వంసమైనట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. వాటిని స్థానిక రెవెన్యూ శాఖాధికారులు పరిశీలించి జిల్లా పాలనాధికారికి నివేదిక అందజేశారు.


సండూరు తాలూకా ఉప్పరహళ్లిలో కూలిన ఇంటి పైకప్పు

ముంపునకు గురైన పంటలు

జిల్లాలోని సండూరు తాలూకాలో అత్యధిక వర్షపాతం నమోదవడంతో పాటు నారిహళ్ల జలాశయం గేట్లు ఎత్తడంతో దిగువనున్న వివిధ పంటలు ముంపు బారిన పడ్డాయి. ప్రధానంగా టమాట, మొక్కజొన్న, సొరకాయ, క్యాబేజీ తదితర కూరగాయల పంటలు పాడవడంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు. ప్రాథమికంగా జిల్లాలో 10.07 హెక్టార్లలో వ్యవసాయ పంటలు, 29 మంది కర్షకులకు చెందిన 12.01 హెక్టార్ల ఉద్యానవన పంటలకు నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేశారు. కురెకుప్ప చిన్నకారు రైతులు ఎకరా, రెండెకరాల్లో కూరగాయలు సాగుచేసి తోరణగల్లు, జిందాల్‌కు విక్రయించుకుంటూ జీవనం సాగిస్తుండగా, వారిపై వరుణుడు ప్రతాపం చూపడంతో ఆవేదన చెందుతున్నారు. సండూరు తాలూకాలో ఉద్యానవన పంటలకు భారీ నష్టం వాటిల్లినట్లు ఆ శాఖ అధికారులు తెలియజేస్తున్నారు. సర్వే నివేదిక వచ్చిన తర్వాత పరిశీలించి బాధిత అన్నదాతలకు పరిహారం అందనున్నట్లు శాఖాధికారులు తెలిపారు.


కురెకుప్పలో నష్టపోయిన సొరకాయ పంట

జిల్లాలో 38.07 మి.మీ వర్షపాతం: అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో భారీ వర్షం కురిసింది. ఈ నెల 13 నుంచి 19 వరకు 22.01 మి.మీ వర్షపాతం పడాల్సి ఉండగా, కేవలం మూడు రోజుల్లోనే 38.7 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. తాలూకాల వారీగా బళ్లారిలో 21.09 మి.మీ., సండూరు 51.2, సిరుగుప్ప 47.3, కురుగోడు 26.4, కంప్లి 36.8 మి.మీ వర్షపాతం నమోదైంది. సండూరు తాలూకాలో అత్యధిక వర్షం కురవడంతో ఉద్యానవన పంటలు నష్టపోయాయి.


పాడైన టమాట పంటను పరిశీలిస్తున్న ఉద్యానవన అధికారులు, సిబ్బందితో రైతు మహారుద్రగౌడ

నేలకొరిగిన వరి పంట

హొసపేటె, న్యూస్‌టుడే: హొసపేట తాలూకాలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు వరి రైతులను తీవ్ర నష్టానికి గురి చేశాయి. ఈ నెలాఖరులో కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట వాన దెబ్బకు పూర్తిగా నేలకొరిగింది. సుమారు 400 ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లినట్లు రైతు సంఘం నాయకులు అంచనా వేశారు. తాలూకాలోని ఇప్పిత్తేరి మాగాణి, హొసూరు, ముద్లాపుర, భట్రహళ్లిలో వరి తీవ్రంగా దెబ్బతింది. కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు టి.నాగరాజ్, ప్రముఖులు సణ్ణక్కి రుద్రప్ప తదితరులు నష్టం వాటిల్లిన ప్రాంతాల్లో పర్యటించారు. వరి రైతులు లబోదిబోమంటున్నా అధికారులు అక్కడికి రావడం లేదని టి.నాగరాజ్ ఆరోపించారు.


ముద్లాపురలో వరి దుస్థితి

'కుడ్య' కళాతరంగాలు

'గోడె బెంగళూరు' షురూ


గోడపై చిత్రాన్ని పూర్తి చేస్తున్న కళాకారుడు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : ఉద్యాన నగరిలోని పలు ప్రాంతాల్లో గోడలను సుందరంగా మార్చివేసేందుకు అన్‌బాక్సింగ్ ఫౌండేషన్, బీఎంఆర్‌సీఎల్ సంస్థలు ముందుకు వచ్చాయి. 'గోడె బెంగళూరు' పేరిట నగర సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలు, పండగలు, కళ తదితరాలను ప్రతిబింబించే చిత్రాలను మెట్రో స్టేషన్లు, మెట్రో రైలు కొనసాగే మార్గంలోని రహదారుల్లోని గోడలపై చిత్రించనున్నారు. ఈ చిత్రాలను పూర్తి చేయడంతో పాటు నవంబరు 30 నుంచి డిసెంబరు 15 వరకు 'బెంగళూరు హబ్బ'ను ఆచరించేందుకు అన్‌బాక్సింగ్ ఫౌండేషన్ సన్నాహాలు చేసుకుంటోంది. పది మంది కళాకారులు తమ సహాయకులతో కలిసి బొమ్మలు వేయడాన్ని ప్రారంభించారు. వీరు వేస్తున్న చిత్రాలను సురేశ్ జయరామ్, అర్చనా హండె, రవికుమార్ కాశి పర్యవేక్షిస్తున్నారు. ఉత్తమ చిత్రాలు వేసిన కళాకారులను 'బెంగళూరు హబ్బ' సమయంలో సత్కరిస్తామని ఫౌండేషన్ ప్రతినిధి కామిని సాహ్ని తెలిపారు. గోడలు సుందరంగా ఉంటే, పాదచారులు, నగరానికి వచ్చే పర్యాటకులకు చక్కని అనుభూతిని ఈ చిత్రాలు అందిస్తాయని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

పనిచేసే సంస్థకే మోసం

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : తాము పని చేస్తున్న కంపెనీని వంచిస్తున్న ఒక అసిస్టెంట్ మేనేజరు, అతని ముగ్గురు అనుచరులను ఆగ్నేయ విభాగం సైబర్ ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. నిందితులను శ్రేయస్, కౌశిక్, రంగనాథ్, ఆనంద్‌గా గుర్తించారు. పోర్టర్ కంపెనీ యాప్‌లో నకిలీ కస్టమర్, డ్రైవర్ల ఐడీలను సృష్టించి కంపెనీకి రూ. 90 లక్షల వరకు వంచించారని నగర పోలీసు కమిషనర్ దయానంద్ తెలిపారు. వీరు కర్ణాటకతో పాటు తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్‌లోనూ ఇదే తరహా వంచనలకు పాల్పడ్డారని ప్రాథమిక దర్యాప్తులో గుర్తించామని చెప్పారు.

ప్రమాదంలో విద్యార్థి మృతి

శివమొగ్గ, న్యూస్‌టుడే : తీర్థహళ్లి తాలూకా బెజ్జవళ్లి కూడలి సమీపంలో శుక్రవారం ఉదయం సంభవించిన రోడ్డు ప్రమాదంలో ప్రథమ్ (16) అనే డిప్లొమా విద్యార్థి మరణించాడు. రోడ్డు దాటుతున్న అతన్ని ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానిక ఆసుపత్రిలో ప్రథమ చికిత్స ఇచ్చి, మంగళూరు వెన్‌లాక్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో అతను మరణించాడు. తీర్థహళ్లి గ్రామీణ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ప్రకాశ్ కందకూర చిత్రాలకు పురస్కారం


నీలి రిబ్బన్ అవార్డుకు ఎంపికైన 'రోప్ వాక్' చిత్రం (అంతరచిత్రంలో) ప్రకాశ్

కారటగి, న్యూస్‌టుడే: కొప్పళ ఛాయాచిత్ర గ్రాహకుడు ప్రకాశ్ కందకూర తీసిన మూడు చిత్రాలకు అంతర్జాతీయ పురస్కారాలు వరించాయి. అమెరికా-అట్లాంటిక్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫొటోగ్రఫీ, ది ఫొటోగ్రాఫిక్ సొసైటీ ఆఫ్ సింగపూర్, గ్రీస్‌లోని గ్రీక్ ఆర్టిస్టిక్ ఫొటోగ్రఫీ సంస్థలు సంయుక్తంగా ఇటీవల పసిఫిక్-అట్లాంటిక్ అంతర్జాతీయ-2024 ఛాయాచిత్ర పోటీలు జరిపాయి. అందులో ప్రకాశ్ కందకూర జర్నలిజం విభాగంలో తీసిన 'రోప్ వాక్' చిత్రానికి బ్లూ రిబ్బన్, ఇదే విభాగంలో 'ది ఫియర్' శీర్షికన మరో చిత్రానికి వెండి పతకం దక్కాయి. మరో విభాగంలో 'ఫ్రెండ్ షిప్' చిత్రానికి హానర్ మెన్షన్ అవార్డు లభించింది. ఆసియా, అమెరికా, యూరప్ ఖండాల్లో సింగపూర్, అమెరికా, గ్రీస్ దేశాలు నిర్వహించిన ఈ పోటీలో 46 దేశాలకు చెందిన 249 మంది ఛాయాచిత్ర గ్రాహకులు తీసిన 4 వేలకు పైగా చిత్రాలు వచ్చాయి. ఈ నెల 20 తర్వాత ఆన్‌లైన్ గ్యాలరీలో పురస్కారాలకు ఎంపికైన ఛాయాచిత్రాల ప్రదర్శన ఉంటుంది. ప్రకాశ్ కందకూరను పలువురు అభినందించారు.

చోదకుడులేని మెట్రో.. పట్టాలెక్కడానికి సిద్ధం


పసుపు పచ్చ నడవాలో డ్రైవర్ రహిత మెట్రో రైలు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : 'నమ్మ మెట్రో' పసుపు పచ్చ నడవా (ఎల్లో కారిడార్) మార్గాన్ని అన్నిరకాల పరీక్షల అనంతరం ప్రయాణికుల అవసరాలకు సిద్ధం చేస్తున్నారు. ఈ ఏడాది ఆఖరునాటికి అత్యాధునిక మెట్రో పరుగులు తీయనుంది. అవసరమైన యంత్రాలతో కూడిన బోగీలు ఇంకా చైనా నుంచి రాకపోవడంతో దీపావళికి ప్రారంభించాలన్న ప్రతిపాదనలను ఏడాది ఆఖరులోగా.. అంటూ మార్చుకున్నారు. సిగ్నల్, సమాచార వ్యవస్థ, విద్యుత్తు సరఫరా, పట్టాలు, ప్లాట్‌ఫాం తదితరాలను నిపుణులు పరిశీలించారు. అన్నీ సక్రమంగా ఉన్నట్లు తేల్చారు. ఇదివరకే 45 రోజులపాటు డ్రైవర్ రహిత మెట్రో రైలు ప్రయోగాత్మంగా పరుగులు తీసి భళా అనిపించింది. ఆయా స్టేషన్లలో రైలు నిలిచాక.. తలుపులు తెరుచుకొని- ఆపై మూసుకోవడంతో పాటు ఒక్కోచోట ఎన్ని నిమిషాలపాటు ఆగాల్సిందీ నిర్ధారించారు. ఈ పర్యవేక్షణ పనులను చైనా ఇంజినీరింగ్ నిపుణులతో కలిసి బీఎంఆర్‌సీ ఇంజినీర్లు పరిశీలించారు. చైనా నుంచి వచ్చిన రెండు డ్రైవర్ రహిత మెట్రో రైళ్లతో ఈ పరీక్షలు ఇన్నాళ్లూ కొనసాగించారు. చైనా సహకారంతో కోల్‌కతాలో తయారవుతున్న యంత్రాలు త్వరలో బెంగళూరు నగరానికి చేరుకునే అవకాశాలు ఉన్నట్లు బీఎంఆర్‌సీఎల్ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మార్గంలో తొలి విడతగా ఆర్.వి.రోడ్డు- బొమ్మసంద్ర మధ్య 19.15 కిలోమీటర్ల పొడవునా సేవలు ప్రారంభిస్తారు. మార్గానికి అత్యంత కీలకమైన 33 కిలోవాట్ల విద్యుద్దీకరణ పనులు పూర్తి చేశారు. కొత్తగా నిర్మించిన 14 ఉపరితల మెట్రో స్టేషన్లు ఆధునిక సేవలకు నిలయాలు. జయదేవ్ ఆసుపత్రి కూడలి వద్ద ఇంటర్ ఛేంజ్ స్టేషన్ కీలకం. సేవలు అందుబాటులోకి వస్తే.. ఐటీ, బీటీ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు ఎంతో వెసులుబాటు కానుంది.


జయదేవ్ ఆసుపత్రి కూడలిలో కీలకమైన ప్రాంగణం


శరవేగంగా సాగుతున్న చివరి దశ పనులు


బొమ్మనహళ్లి స్టేషన్.. ఐటీ ఉద్యోగులకు కీలకం

పాము కాటుకు ఇద్దరు రైతుల బలి

హొసపేటె, న్యూస్‌టుడే: పొలం పనులు చేస్తున్న రైతులు హసగోడు గుడదప్ప(48), చంద్రప్ప(24)లను పాము కాటేయడంతో మృతి చెందిన దుర్ఘటన శనివారం వేర్వేరు ప్రాంతాల్లో చోటుచేసుకున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హరపనహళ్లి తాలూకా తౌడూరుకు చెందిన అన్నదాత గుడదప్ప మొక్కజొన్న పొలంలో పనులు చేస్తుండగా పాము కరిచింది. తీవ్ర అస్వస్థతకు లోనైన ఆయనను తోటివారు చికిత్స నిమిత్తం అరసికెరె ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స ఫలించక చనిపోయారు. మరో ఘటనలో కూడ్లిగి తాలూకా గుడేకోటకు చెందిన యువ రైతు చంద్రప్ప పొలంలో గడ్డి కోస్తుండగా పాము కాటేసింది. అరసికెరె, గుడేకోట పోలీసులు కేసులు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదవశాత్తు అన్నదాత మృతి

హొసపేటె, న్యూస్‌టుడే: పురుగు మందు కలిపిన డబ్బాలో తాగునీరు పోసుకొని పొరపాటున తాగిన రైతు మంజునాథ్ (48) మృతి చెందిన ఘటన హగరిబొమ్మనహళ్లి తాలూకా చిమ్మనహళ్లిలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిమ్మనహళ్లికి చెందిన అన్నదాత మంజునాథ్ పొలానికి పురుగు మందు పిచికారీ చేశారు. అనంతరం అదే డబ్బాలో పొరపాటున తాగునీరు నింపుకొని తాగారు. తీవ్ర అస్వస్థతకు గురైన ఆయనను కుటుంబ సభ్యులు హగరిబొమ్మనహళ్లి ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం తరలించగా అర్ధరాత్రి చనిపోయారు. హగరిబొమ్మనహళ్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

విద్యాభివృద్ధితోనే సమాజ ప్రగతి

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : సమాజంలో సమానత కోసం బాలలంతా విద్యావంతులుగా ఎదగాలని, కష్టపడి ఉన్నత శిఖరాలు అందుకుంటే కుటుంబం ప్రగతిబాట పడుతుందని ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. బెంగళూరు రవీంద్ర కళాక్షేత్రలో కర్ణాటక రాష్ట్ర తిగళర (వహ్నికుల క్షత్రియ) సంఘం శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి, చక్కని ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందించి, అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య సాయంతోనే సమాజంలో మార్పు సాధ్యమన్నారు. ప్రగతికి అదే ఊతమిస్తుందని చెప్పారు. వహ్నికుల క్షత్రియ వర్గం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు సిద్ధమని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బాలయోగి సాయిమంజునాథ్‌స్వామి, ప్రణవానందపుర మహాస్వామి, మాజీ ఎమ్మెల్సీ పీఆర్ రమేష్, యలహంక నగరసభ మాజీ అధ్యక్షుడు యు. కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


ప్రతిభ పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ తదితరులు

బన్నేరుఘట్టకు తెల్లపులి!

బెంగళూరు (కెంగేరి), న్యూస్‌టుడే : రాజధాని నగర శివారు బన్నేరుఘట్ట జీవ ఉద్యానవనానికి కొత్త అతిథులు విచ్చేశాయి. కేంద్ర మృగాలయ ప్రాధికార ప్రాణుల వినిమయం పథకంలో భాగంగా పాట్నా మృగాలయం నుంచి రెండు మొసళ్లు, ఆరేళ్ల తెల్లపులి, అడవి పిల్లి ఇక్కడికి చేరుకున్నాయి. ఐదు రోజుల ప్రయాణం తర్వాత ఆ వన్య ప్రాణులు ఉద్యాననగరంలో కాలుమోపాయి. వీటికి ప్రత్యామ్నాయంగా పాట్నాకు జీబ్రా, థమిన్ జింకలను పంపించారు. జంతువుల సరఫరా సమయంలో సంబంధిత వాహనానికి తెలంగాణ పరిధిలో ప్రమాదం వాటిల్లినా.. ఎలాంటి నష్టం కలగలేదు. అరణ్యాధికారులు సురక్షితంగా వాటిని తరలించుకొచ్చారు. వీటిని ముందుజాగ్రత్తగా 45 రోజుల పాటు క్వారంటైన్‌లో ఉంచారు. ఇక్కడి వాతావరణానికి అలవాటు పడ్డాక.. సందర్శకులు వీక్షించేందుకు అవకాశం కల్పిస్తారు.



శ్రవణానందంగా కథావేదిక

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : భారతీయ పౌరాణిక కథలు, గాథలను 'మైథాలజీ మార్వెల్స్- సింప్లీ శక్తి' పేరిట బాలలు, వారి కుటుంబ సభ్యులకు వినిపించేందుకు 'ఆట గలాట' కళావేదికపై శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి చక్కని స్పందన లభించింది. కళాకారులు లావణ్య ప్రసాద్, మీను శివరామకృష్ణన్ మూడు గంటల పాటు వివిధ పౌరాణిక గాథలు, కథలతో సభ్యులు, కార్యశాలకు హాజరైన కుటుంబ బాలలను అలరించారు. సంగీతం, నృత్యంతో రూపకంలా ప్రదర్శించిన ప్రదర్శనకు చక్కని స్పందన లభించింది.


నాటకీయంగా కథను వినిపించే ప్రయత్నం..

బళ్ళారి
•బళ్ళారి •రాయచూరు

వారికి పదవి... వీరికి పెత్తనం



బళ్లారి నగర పాలికె సాధారణ సమావేశంలో మహిళా కార్పొరేటర్ల భర్తలు, తండ్రులు పెత్తనం చెలాయించారు. సమావేశం ప్రారంభంలోనే కార్పొరేటర్లు, అధికారులు, సిబ్బంది, మీడియా ప్రతినిధులు మినహా మిగిలిన వారు భవనం నుంచి బయటకు వెళ్లాలని మేయర్ సూచించినట్లు అధికారులు ప్రకటించారు. కాగా 7వ వార్డు కార్పొరేటర్ ఉమాదేవి భర్త శివరాజ్, 4వ వార్డు కార్పొరేటర్ త్రివేణి తండ్రి సూరి, 37వ వార్డు కార్పొరేటర్ మలన్‌బీ భర్త శర్మస్, స్థాయీ సమితి అధ్యక్షురాలు ఈరమ్మ భర్త సమావేశంలో దర్జాగా కూర్చుని పాలికె సంబంధిత బుక్‌లెట్ చదువుకుంటూ కనిపించారు. -న్యూస్‌టుడే, బళ్లారి

కేపీసీసీ మాధ్యమ ఉపాధ్యక్షుడి నియామకం



కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ సమితి (కేపీసీసీ) మాధ్యమ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా హొసపేటె యువ నాయకుడు నింబగల్లు రామకృష్ణ నియమితులయ్యారు. ఈమేరకు ఆ విభాగం రాష్ట్ర బాధ్యుడు పవన్‌కుమార్ నిరెల్లా ఆదేశాలు జారీ చేశారు. పార్టీ కార్యక్రమాలను మాధ్యమాల ద్వారా ప్రజలకు చేరవేయడంలో కృషి చేయాలని అందులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణకు పలువురు స్థానిక కాంగ్రెస్ నాయకులు అభినందనలు తెలిపారు. -న్యూస్‌టుడే, హొసపేటె

పోస్టల్ బ్యాలెట్‌కు అనుమతి


మాట్లాడుతున్న ఏడీసీ మహమ్మద్ ఝుబేర

బళ్లారి, న్యూస్‌టుడే: సండూరు అసెంబ్లీ ఉప ఎన్నికల విధుల్లో ఉండే ఆ నియోజకవర్గ అధికారులు, సిబ్బంది ఓటు వేయడానికి పోస్టల్ బ్యాలెట్‌కు అనుమతి ఇస్తున్నట్లు అదనపు జిల్లా పాలనాధికారి మహమ్మద్ ఝుబేర తెలిపారు. శనివారం ఆయన తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రతి ఓటు అమూల్యమైందని, పోలింగ్ నాడు విధి నిర్వహణలో ఉండే ఉద్యోగులు ఓటు హక్కు కోల్పోకూడదనే ఉద్దేశంతో ఈ అవకాశం కల్పించినట్లు తెలిపారు. జెస్కాం, బీఎస్ఎన్ఎల్, దూరదర్శన్, ఆకాశవాణి, ఆరోగ్య, అగ్నిమాపక సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులు, అంబులెన్స్ సిబ్బంది, జైలు, 16 శాఖల్లో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవచ్చన్నారు. ఆ కేంద్రంలో ఓటు వేసే వారు మొదట ఫారం-12డి దరఖాస్తులను భర్తీచేసి నియోజకవర్గానికి కేటాయించిన నోడల్ అధికారికి సమర్పించాలన్నారు. 12డి ఫారం సమర్పించిన వారు మాత్రమే ఫెసిలిటేషన్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. కేటాయించిన రోజు కేంద్రానికి వచ్చి ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఆయా శాఖల్లో విధుల్లో ఉండే అధికారులు, సిబ్బంది వివరాలు ఇవ్వాలని కోరారు. వాటి ఆధారంగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో బ్యాలెట్ నోడల్ అధికారి సోమశేఖర్, అగ్నిమాపక, కేఎస్ఆర్టీసీ, ట్రాఫిక్ పోలీస్, జెస్కాం, వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.

వాడీవేడిగా పాలికె సాధారణ సమావేశం

- సమస్యలపై చిత్రాల ప్రదర్శన
- అధికారులను నిలదీసిన కార్పొరేటర్లు

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి నగర పాలికె సాధారణ సమావేశం వాడీవేడిగా సాగింది. నగరంలో వివిధ సమస్యలపై అధికార, ప్రతిపక్ష కార్పొరేటర్లు అధికారులను నిలదీశారు. వారు సరైన జవాబులు ఇవ్వకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. నగర పాలికె సాధారణ సమావేశం శనివారం మేయర్ ముల్లంగి నందీష్ అధ్యక్షతన జరిగింది. తొలుత మేయర్ మాట్లాడుతూ నగర పాలికెలో 1.30 లక్షలకుపైగా ఇళ్లు, పరిశ్రములు, ఖాళీ స్థలాలు ఉన్నాయన్నారు. వాటికి సంబంధించి సరైన పత్రాలు సమర్పిస్తే 30 రోజుల్లో ఫారం-2 అందజేస్తారన్నారు. ఆన్‌లైన్‌లో ప్రతి ఒక్కరూ పత్రాలను నమోదు చేసుకుంటే, మధ్యవర్తులు లేకుండా నేరుగా పన్నులు చెల్లించవచ్చన్నారు. పాలికెకు ప్రస్తుతం రూ.40 కోట్ల నుంచి రూ.45 కోట్ల ఆదాయమే వస్తోందన్నారు. 1.30 లక్షల ఇళ్లు, పరిశ్రమలు, ఖాళీ స్థలాలు నమోదు చేసుకుంటే ఏడాదికి రూ.100 కోట్ల వరకు ఆదాయం అందుతుందన్నారు. ప్రతి నెలా వేతనాలు తదితర వాటికి రూ.3.50 కోట్లు చెల్లిస్తున్నామని, నెలకు రూ.3 కోట్లు మాత్రమే వసూలవుతోందన్నారు. పాలికెలో మొత్తం 39 వార్డులుండగా, ప్రతి వార్డుకు 40 నుంచి 50 విద్యుత్తు స్తంభాలు అవసరమని జెస్కాం అధికారులను మేయర్ కోరారు. దీనిపై పది రోజుల్లో నివేదిక అందజేస్తామని అధికారులు జవాబు ఇచ్చారు. పన్నుల వసూలుకు అధికారులు, సిబ్బందితో కార్పొరేటర్లు సహకరించాలని మేయర్ కోరారు.


సమావేశంలో పాల్గొన్న మేయర్ నందిష్, ఉపమేయర్ సుకుం, స్థాయి సమితి అధ్యక్షులు పద్మారోజా, ఈరమ్మ, కమిషనర్ ఖలీల్‌సాబ్

అధికారులపై కార్పొరేటర్ల మండిపాటు



అనంతరం మూడో వార్డు కార్పొరేటర్ మండూర్ల ప్రభంజన్‌కుమార్ మాట్లాడారు. పాలికెకు సంబంధించిన పత్రాలు, సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చినా వారు స్పందించడం లేదన్నారు. ఇంకా సామాన్యుల పరిస్థితి ఎలాగుంటుందో అర్థమవుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2016-17 ఏడాది ఆడిట్ రిపోర్ట్ ఇవ్వాలని పలుమార్లు కోరినా పట్టించుకోలేదన్నారు. ఇంతలోనే అధికారులు ఆడిట్ రిపోర్ట్ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రభంజన్‌కుమార్ మూడో వార్డులోని భూగర్భ మురుగు కాలువ, రహదారుల దుస్థితి, కలుషిత తాగునీరు తదితర సమస్యలపై సభలో చిత్రాలు ప్రదర్శించారు. స్పందించిన అధికారులు సమస్యలను పది రోజుల్లో పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.



- నగర పాలికెలో అమృత పథకం కింద రూ.100 కోట్లతో భూగర్భ మురుగుకాలువ పనులు జరుగుతున్నాయి. నేటివరకు ఏ వార్డులో ఎంతమేర జరిగాయో పాలికెకు తెలియడం లేదు. దీనిపై కమిటీని నియమించి వార్డుల వారీగా పరిశీలించాలని కార్పొరేటర్లు గాదెప్ప, విక్కి, ప్రతిపక్ష నేత ఇబ్రహీంబాబు మేయర్‌ను కోరారు. ఆయన సోమవారం కమిటీని ఏర్పాటు చేస్తామని చెప్పారు.


జవాబు ఇస్తున్న పాలికె ఆరోగ్యశాఖాధికారి కిరణ్

- జిల్లా క్రీడా మైదానం ముందు ఏర్పాటు చేసిన చెరువులో నీటి నిల్వ తగ్గిందని, సరైన నిర్వహణ లేకపోవడంతో దుర్వాసనతో చుట్టుపక్కల కాలనీవాసులు, క్రీడాకారులు, వాకర్లు ఇబ్బందులు పడుతున్నారని కార్పొరేటర్ గోవిందరాజులు తెలిపారు. దీనిపై నిర్మిత కేంద్రం అధికారి మాట్లాడుతూ చెరువు, తదితర పనులు పూర్తిచేసి నిర్వహణను క్రీడా శాఖకు అప్పగించామన్నారు. వెంటనే సమస్య తీర్చాలని పలువురు కార్పొరేటర్లు డిమాండు చేశారు.
- పాలికె పరిధిలోని రోడ్లపై పడిన గుంతలను పూడ్చడం లేదని, ప్రజలు తమను నిలదీస్తున్నారని పలువురు కార్పొరేటర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి సమావేశానికి రావడం, రెండు సార్లు టీ తాగడం, మధ్యాహ్నం భోజనంతో సమయం వృథా చేస్తున్నామని, ప్రజల సమస్యల పరిష్కారంపై ఎవరూ దృష్టి సారించడం లేదని కార్పొరేటర్ సురేఖగౌడ ఆవేదన వ్యక్తం చేశారు. సాధారణ సమావేశం ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కావల్సి ఉండగా, మధ్యాహ్నం 12.05 గంటలకు మొదలుపెట్టడం గమనార్హం. ఉప మేయర్ డి.సుకుంబి, స్థాయి సమితి అధ్యక్షులు పద్మారోజ, ఈరమ్మ, సురేఖగౌడ, నూర్, కమిషనర్ ఖాలీల్‌సాబ్ పాల్గొన్నారు.

విద్యార్థుల కోసమే వసతి నిలయాలు



నిలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గవియప్ప, కలెక్టర్ దివాకర్

హొసపేటె, న్యూస్‌టుడే: విద్యార్థులు ప్రశాంతంగా చదువుకొని మంచి మార్కులు సాధించేందుకు వసతి నిలయాలు ఎంతగానో తోడ్పతాయని స్థానిక శాసనసభ్యుడు హెచ్.ఆర్.గవియప్ప అన్నారు. పట్టణంలోని ధార్వాడ్ మార్గంలో శనివారం ఆయన దేవరాజ్ అరసు మెట్రిక్ అనంతర విద్యార్థినుల కోసం వసతి నిలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. దేవరాజ్ అరసు వెనుకబడిన వర్గాల సంక్షేమ మండలి నుంచి రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి వసతి నిలయాలు ప్రారంభమవుతన్నట్లు తెలిపారు. వెనుకబడిన వర్గాల విద్యార్థులకు ఈ హాస్టళ్లతో వెసలుబాటు కలుగుతుందన్నారు. జిల్లా పాలనాధికారి ఎం.ఎస్.దివాకర్ మాట్లాడుతూ వసతి నిలయాల్లో మౌలిక వసతులకు ప్రాధాన్యం ఇవ్వాలని, విద్యార్థులు శ్రద్ధగా చదువుకునే వాతావరణం కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో హుడా అధ్యక్షుడు మొహ్మద్ ఇమామ్ నియాజి, వెనుకబడిన వర్గాల సంక్షేమాధికారి కేబీ రామచంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద కళాశాల వద్ద ఆందోళన


ధర్నా చేస్తున్న విద్యార్థులు

మాన్వి, న్యూస్‌టుడే : స్థానిక కేపీఎస్‌వీఎస్ ఆయుర్వేద వైద్య కళాశాల యాజమాన్యం ప్రవర్తన, సదుపాయాల కొరతను నిరసిస్తూ వైద్య కళాశాల విద్యార్థులు ఆందోళనకు దిగారు. ఇతర రాష్ట్రాలు, జిల్లాల విద్యార్థులు సాయంత్రం కళాశాల ఎదుట, రాత్రి క్యాంటిన్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ కళాశాలలో కనీస సౌకర్యాలు లేవని, తాగేనీరు కూడా తామే తెచ్చుకుంటున్నామని ఆరోపించారు. వాయిదా పద్ధతుల్లో కళాశాల రుసుములు చెల్లించమని చెప్పారని, ఇప్పుడు వడ్డీ కట్టమంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాతపూర్వకంగా ఇవ్వాలని విద్యార్థులు డిమాండ్ చేస్తే పట్టించుకోలేదన్నారు. కళాశాలలో వైద్యుల కొరత ఉందన్నారు. వైఫల్యాలను ప్రశ్నిస్తే హాజరుశాతం తక్కువగా ఉందని రూ.5 వేల నుంచి రూ.50 వేల వరకు చెల్లించాలని కళాశాల యజమాన్యం డిమాండ్ చేస్తోందని ఆరోపించారు. సంతకాల కోసం వెళ్లే విద్యార్థులతో నిర్వాహకుడు అనుచితంగా వ్యవహరిస్తున్నాడని తెలిపారు. విద్యార్థుల ఆందోళన విషయాన్ని తెలుసుకున్న పోలీసులు కళాశాలకు వచ్చి విద్యార్థులతో చర్చించారు. ఎస్సై వీరనగౌడ విషయాన్ని శిక్షణ సంస్థ అధ్యక్షుడు కల్మఠ స్వామీజీకి తెలియచేశారు. ఆయన వచ్చి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు చేసిన ఆరోపణలేవీ తనకి తెలియవని, దీనిపై విచారించి తప్పిదాలకు పాల్పడిన కళాశాల పరిపాలనాధికారి, నిర్వాహకుడిపై చర్యలు తీసుకుంటానని, విద్యార్థులకు కచ్చితంగా న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులు నిరసన విరమించారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న కల్మఠ స్వామీజీ


ప్రధానాచార్య నాగరాజ్‌కి వినతిపత్రం సమర్పిస్తున్న విద్యార్థులు

సెమిస్టర్ రుసుం తగ్గింపునకు వినతి

హొసపేటె, న్యూస్‌టుడే: అమాంతం పెంచిన డిగ్రీ 3, 5వ సెమిస్టర్ రుసుంలను తగ్గించాలంటూ భారతీయ విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) నేతృత్వంలో విద్యార్థులు పట్టణంలోని విజయనగర కళాశాల ముందు శనివారం ఆందోళన చేపట్టారు. నేతృత్వం వహించిన సమాఖ్య జిల్లా కార్యదర్శి శివారెడ్డి, సంయుక్త కార్యదర్శి కె.ఎ.పవన్‌కుమార్ మాట్లాడారు. బళ్లారి విజయనగర శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం 3, 5వ సెమిస్టర్ రుసుంను ఎందుకు పెంచారో తెలియడం లేదని మండిపడ్డారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులే ఎక్కువ సంఖ్యలో చదువుకుంటారని గుర్తుచేశారు. ఉన్నట్టుండి రుసుం పెంచితే ఎలాగని ప్రశ్నించారు. తగ్గించాలంటూ విజయనగర కళాశాల ఉపప్రధానాచార్యుడు నాగరాజ్‌కు వినతిపత్రం సమర్పించారు.

అధ్యాపకుల సంఘం నూతన కార్యవర్గం

మాన్వి, న్యూస్‌టుడే : తాలూకా ప్రైవేట్ కళాశాలల అధ్యాపకుల సంఘానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. శనివారం స్థానిక గాంధీ కళాశాలలో సమావేశం నిర్వహించారు. సంఘం గౌరవాధ్యక్షుడిగా ఈరణ్ణ మర్లట్టి, అధ్యక్షుడుగా ఆంజినేయ నస్లాపూర్, ప్రధాన కార్యదర్శిగా మహిబూబ్ మద్లాపూర్, ఉపాధ్యక్షులుగా సిద్దనగౌడ, శంకరప్ప నక్కుంది, శరణబసవ సీకల్, దేవరాజ్ పోత్నాళ, మహిళా ప్రతినిధిగా సుజాత శ్రీనివాస్, కోశాధికారిగా వీరభద్రయ్యస్వామి, సంఘటనా కార్యదర్శులుగా హనుమంత యడివాళ, హనమంతరాయ ఎన్నికయ్యారు.


ఎంపికైన సంఘం నూతన సభ్యులు వీరే..

శ్రీరామనగర్‌లో ఘనంగా వాల్మీకి జయంతి

శ్రీరామనగర్, న్యూస్‌టుడే: మహర్షి వాల్మీకి జయంతిని శనివారం శ్రీరామనగర్‌లో ఘనంగా నిర్వహించారు. గంగావతి మార్గంలోని గ్రామ పొలిమేర నుంచి మహర్షి చిత్రపటాన్ని ఊరేగించారు. తుంగభద్ర కాలువ వరకు ఊరేగింపు సాగింది. అక్కడ పూజలు చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, వాల్మీకి సముదాయ ప్రముఖులు పాల్గొన్నారు.

కారటగి మర్లానహళ్లిలో..: తాలూకాలోని మర్లానహళ్లిలో వాల్మీకి జయంతి భక్తిశ్రద్ధలతో జరిగింది. పూర్ణకుంభాలతో మహిళలు వెంట రాగా కళాకారుల నృత్యం, మేళతాళాలు, డప్పుల మోత నడుమ మహర్షి చిత్రపటాన్ని ఆంజనేయ స్వామి ఆలయం నుంచి మారెమ్మదేవి గుడి వరకు ఊరేగించారు. వాల్మీకి కూడలిలోని నామఫలకానికి పూజలు నిర్వహించారు.


శ్రీరామనగర్‌లో వాల్మీకి చిత్రపటం ఊరేగింపు


కారటగి: మర్లానహళ్లిలో కళాకారుల ప్రదర్శన

సముదాయ నిర్మాణం పూర్తిచేస్తాం


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే నాయక్ తదితరులు

మాన్వి, న్యూస్‌టుడే : మధ్యలో నిలిపివేసిన నిర్మాణం పనులను త్వరలో పూర్తి చేయిస్తామని ఎమ్మెల్యే హంపయ్యనాయక్ భరోసా ఇచ్చారు. చాగబావి గ్రామ పంచాయతి పరిధి లక్కందిన్ని గ్రామంలో జరిగిన శివమూర్తి శివాచార్య స్వామి పుణ్యస్మరణ, జాతర కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి మహిమాన్వితుడని, ఆయనను కలిసి మాట్లాడే అవకాశం తనకు దక్కడం భాగ్యమన్నారు. ఈ గ్రామంలో సముదాయ భవనం నిర్మాణం కోసం గతంలో రూ.10 లక్షలు విడుదల చేశామని, గుత్తేదారు మధ్యలోనే పనులు నిలిపివేశారని తెలిపారు. త్వరలోనే నిర్మాణాన్ని పూర్తి చేయిస్తామన్నారు. ఆయన వెంట ప్రముఖులు వై.శరణయ్యనాయక్, రమేశ్‌దర్శనకర్, ఎం.శ్రీనివాస్, బసవరాజ్, గ్రామ పంచాయతీ సభ్యులు తదితరులున్నారు.

ఘనంగా ఉచ్చాయం: జాతర సందర్భంగా భక్తులు శివాచార్య ఉచ్చాయ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ వీధుల్లో ఉచ్చాయాన్ని ఊరేగించారు. జాలాపూరు, భాగ్యనగర్, చాగబావి, మాడగిరి, హొసూరు తదితర గ్రామాల నుంచి స్వామీజీ భక్తులు, అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

గ్రామాల్లో ఆరోగ్య బృందాలు


కార్యకర్తలతో ఆరోగ్యశాఖ అధికారులు

మాన్వి, న్యూస్‌టుడే : పంచాయతీ స్థాయిలోనే ఆరోగ్య సేవలను అందించేందుకు గ్రామ ఆరోగ్య బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు తాలూకా ఆరోగ్య శిక్షణాధికారి బాలప్పనాయక్ పేర్కొన్నారు. తాలూకాలోని నీర్‌మాన్వి గ్రామంలో తాలూకా ఆరోగ్య శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రామ ఆరోగ్య శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు, జీపీ సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలతో బృందాలను ఏర్పాటు చేసి వారికి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అభివృద్ధి శాఖ అధికారిణి సరితా, జీపీ కార్యదర్శి మల్లికార్జున, సముదాయ ఆరోగ్యాధికారి హుసేనమ్మ, ప్రాథమిక ఆరోగ్య సురక్ష అధికారి చంద్రిక, ఆరోగ్య నిరీక్షణాధికారి విశ్వనాథ్, జీపీ సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగుల ఎన్నికలకు నామపత్రాల దాఖలు

సిరుగుప్ప: ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఎన్నికలకు 53 నామపత్రాలు దాఖలైనట్లు ఎన్నికల అధికారి దేవేంద్రగౌడ పేర్కొన్నారు. నామినేషన్ల సమర్పణకు శుక్రవారం చివరి తేదీ. శనివారం పరిశీలన పూర్తయింది. ఉపసంహరణకు 21 చివరి తేదీ. 22 శాఖల నుంచి 34 మంది సభ్యుల ఎన్నికకు 28న పోలింగ్ నిర్వహించి అదేరోజు ఫలితాలు ప్రకటిస్తామని ఆయన వెల్లడించారు.

22న ఆరోగ్య మంత్రి జిల్లా పర్యటన

హొసపేట, న్యూస్‌టుడే : రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దినేశ్ గుండూరావ్ 22న విజయనగర జిల్లాలో పర్యటించనున్నారు. ఆ రోజు మధ్యాహ్నం 12 గంటలకు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖకు సంబంధించి విజయనగర, కొప్పళ జిల్లాల్లో జరిగే ప్రగతి సమీక్ష సమావేశంలో పాల్గొంటారు. మరుసటి రోజు ఉదయం కొప్పళ బయల్దేరుతారని మంత్రి వ్యక్తిగత కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

19-10-2024 (ఉ. 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1631.91	1612.57
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	73,241	228
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	74,025	10,505
నీటి నిల్వ (టి.ఎం.సి)	101.421	42.897
గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు)	వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు	

చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ఆగ్రహం


మాట్లాడుతున్న బసవరాజ్

కారటగి, న్యూస్‌టుడే: కారటగి పట్టణంతో పాటు తాలూకాలోని పలు గ్రామాల్లో జరుగుతున్న చట్టవ్యతిరేక కార్యకలాపాలను నియంత్రించకపోతే పోరాటం తీవ్రం చేస్తామని మాజీ ఎమ్మెల్యే దడేసుగూరు బసవరాజ్ హెచ్చరించారు. ఆయన శనివారం కారటగిలో విలేకరులతో మాట్లాడారు. చాలా రోజులుగా తాలూకాలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని, వెంటనే వాటిని పోలీసులు నియంత్రించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కారటగి బంద్‌కు పిలుపునిస్తామన్నారు. ఆయన వెంట భాజపా నేత నాగరాజ బిల్గార్, పార్టీ మండల అధ్యక్షుడు మంజునాథ మస్కి, నాయకులు బసవరాజ ఎత్తినమనె, తిమ్మనగౌడ, ఫక్కీరప్ప నాయక్, దేవరాజ నాయక్, ఆనంద్, తదితరులున్నారు.

గుర్తుతెలియని మృతదేహం స్వాధీనం

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి నగరం పాత బస్సు ప్రాంగణం ఎదురుగానున్న మయూర హోటల్ ముందు ఫుట్‌పాత్‌పై గుర్తు తెలియని మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకొని బీఎంసీఆర్‌సీకి తరలించారు. మృతుడి వయసు 35-40 ఏళ్ల మధ్య ఉంటుందని, 5.4 అడుగుల ఎత్తు, కోల ముఖం, గోధుమ రంగు ఛాయ, సాధారణ శరీరాకృతి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే గాంధీనగర్ పోలీసులను సంప్రదించాలని సూచించారు.

పురుషుడి అదృశ్యంపై ఫిర్యాదు

బళ్లారి, న్యూస్‌టుడే: సండూరు తాలూకా హొసదరోజి గ్రామానికి చెందిన మహమ్మద్ షరీఫ్(40) అనే వ్యక్తి అదృశ్యంపై కుటుంబ సభ్యులు బ్రూస్‌పేటె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నెల 10న బళ్లారి నగరంలోని కొత్త బస్సు ప్రాంగణానికి వెళ్లిన షరీఫ్ తిరిగి ఇంటికి చేరలేదు. కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించినా ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు తమకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



హొసపెటె పట్టణంలోని అంజుమన్ ఖిద్మతే ఇస్లాం సంస్థ, బెంగళూరు సప్తగిరి ఆసుపత్రి కలిసి శనివారం అంజుమన్ సభా భవనంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య పరీక్ష శిబిరానికి భారీ స్పందన లభించింది. హృద్రోగం, నరాల వ్యాధి, కేన్సర్, కిడ్నీ సమస్యలతో బాధపడే రోగులను వైద్యులు ఉచితంగా పరీక్షించి మందులు అందజేశారు. శిబిరాన్ని కాంగ్రెస్ నాయకుడు గుజ్జల నాగరాజ్ ప్రారంభించి మాట్లాడారు. తరచూ ఇలాంటి ఉచిత శిబిరాలు నిర్వహించాలని, నిరుపేదలకు అవి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అంజుమన్ సమితి అధ్యక్షుడు మహ్మద్ ఇమామ్ నియాజి, ప్రముఖులు పరశురామ్ నాయక్, కొట్రేశ్, వైద్య నిపుణులు అభిషేక్, శోహన్, శరవణన్, వెళ్లిరత్నం, జునైద్ తదితరులు పర్యవేక్షించారు. -న్యూస్‌టుడే, హొసపేటె

బాబోయ్ చెరువులకు గండ్లు


గండిపడిన ఓ చెరువు వద్ద ఇలా..

చెళ్లకెర, న్యూస్‌టుడే: చెళ్లకెర తాలూకాలో వారం రోజులుగా ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు చెరువులకు గండ్లు పడి పంటలకు నష్టం వాటిల్లింది. తాలూకాలోని చిక్కమదురె, వరవ, భీమనకెరె, తిప్పయ్యకెరె, గొల్లరహట్టి, నాయకన హట్టి, తిప్పయ్యన కోటెకెరె, సోమలకెరె చెరువులకు గండి పడింది. తిమ్మనహళ్లి గ్రామ శివారులో మిరప, ఉల్లిగడ్డ, మొక్క జొన్న పంటలకు నష్టం వాటిల్లింది. బిందు సేద్యం పైపులు కొట్టుకుపోయాయి. భీమనకెరె వద్ద ఏడు గొర్రెలు ప్రవాహంలో గల్లంతయ్యాయి. గ్రామంలోని ఓ వాగులో కొట్టుకుపోతున్న యువకుడిని పలువురు గ్రామస్థులు రక్షించారు. కోడిహళ్లి, మహదేవపుర, నెరల్గంటి గ్రామాల్లో ఇళ్లు కూలిపోయాయి.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం నేడు

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి నగర జెస్కాం ఉప విభాగం-1 వ్యాప్తిలోని 110/11 కేవీ ఉప కేంద్రంలో మరమ్మతుల నేపథ్యంలో 20న (ఆదివారం) ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని అధికారులు తెలిపారు. దీని పరిధిలో వచ్చే బెంగళూరు రహదారి, అంధ్రాళ్ రహదారి, కొల్మి చౌక్, కాకర్లతోట, బాపూజీ నగర, మిల్లర్‌పేటె, హెచ్.ఆర్.గవియప్ప కూడలి, తేరు వీధి, పారిశ్రామిక ప్రాంతం-1, లారీ టెర్మినల్, జైన్ మార్కెట్, సాయి కాలని, రాణితోట, ఏపీఎంసీ, దొడ్డ మార్కెట్, బొమ్మహళ్ రహదారి చుట్టుపక్కల ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం కలుగుతుందని అధికారులు వెల్లడించారు.

ముస్లిం సోదరుల మౌన ప్రదర్శన

సింధనూరు పట్టణంలో ముస్లిం సోదరులు శనివారం మౌన నిరసన ప్రదర్శన జరిపారు. ఐబీ నుంచి మినీ విధాన సౌధ వరకు ప్రదర్శన సాగింది. ప్రవక్తపై ఉత్తరప్రదేశ్‌కు చెందిన స్వామి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ఈ ప్రదర్శన జరుపుతున్నట్లు ముస్లిం సోదరులు ప్రకటించారు. తక్షణం ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. ఈమేరకు రాష్ట్రపతికి రాసిన వినతిపత్రాన్ని స్థానిక తహసీల్దారుకు సమర్పించారు. -న్యూస్‌టుడే, సింధనూరు



చోదకుడులేని మెట్రో.. పట్టాలెక్కడానికి సిద్ధం


పసుపు పచ్చ నడవాలో డ్రైవర్ రహిత మెట్రో రైలు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : 'నమ్మ మెట్రో' పసుపు పచ్చ నడవా (ఎల్లో కారిడార్) మార్గాన్ని అన్నిరకాల పరీక్షల అనంతరం ప్రయాణికుల అవసరాలకు సిద్ధం చేస్తున్నారు. ఈ ఏడాది ఆఖరునాటికి అత్యాధునిక మెట్రో పరుగులు తీయనుంది. అవసరమైన యంత్రాలతో కూడిన బోగీలు ఇంకా చైనా నుంచి రాకపోవడంతో దీపావళికి ప్రారంభించాలన్న ప్రతిపాదనలను ఏడాది ఆఖరులోగా.. అంటూ మార్చుకున్నారు. సిగ్నల్, సమాచార వ్యవస్థ, విద్యుత్తు సరఫరా, పట్టాలు, ప్లాట్‌ఫాం తదితరాలను నిపుణులు పరిశీలించారు. అన్నీ సక్రమంగా ఉన్నట్లు తేల్చారు. ఇదివరకే 45 రోజులపాటు డ్రైవర్ రహిత మెట్రో రైలు ప్రయోగాత్మంగా పరుగులు తీసి భళా అనిపించింది. ఆయా స్టేషన్లలో రైలు నిలిచాక.. తలుపులు తెరుచుకొని- ఆపై మూసుకోవడంతో పాటు ఒక్కోచోట ఎన్ని నిమిషాలపాటు ఆగాల్సిందీ నిర్ధారించారు. ఈ పర్యవేక్షణ పనులను చైనా ఇంజినీరింగ్ నిపుణులతో కలిసి బీఎంఆర్‌సీ ఇంజినీర్లు పరిశీలించారు. చైనా నుంచి వచ్చిన రెండు డ్రైవర్ రహిత మెట్రో రైళ్లతో ఈ పరీక్షలు ఇన్నాళ్లూ కొనసాగించారు. చైనా సహకారంతో కోల్‌కత్తాలో తయారవుతున్న యంత్రాలు త్వరలో బెంగళూరు నగరానికి చేరుకునే అవకాశాలు ఉన్నట్లు బీఎంఆర్‌సీఎల్ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మార్గంలో తొలి విడతగా ఆర్.వి.రోడ్డు- బొమ్మసంద్ర మధ్య 19.15 కిలోమీటర్ల పొడవునా సేవలు ప్రారంభిస్తారు. మార్గానికి అత్యంత కీలకమైన 33 కిలోవాట్ల విద్యుద్దీకరణ పనులు పూర్తి చేశారు. కొత్తగా నిర్మించిన 14 ఉపరితల మెట్రో స్టేషన్లు ఆధునిక సేవలకు నిలయాలు. జయదేవ్ ఆసుపత్రి కూడలి వద్ద ఇంటర్ ఛేంజ్ స్టేషన్ కీలకం. సేవలు అందుబాటులోకి వస్తే.. ఐటీ, బీటీ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు ఎంతో వెసులుబాటు కానుంది.


శరవేగంగా సాగుతున్న చివరి దశ పనులు


జయదేవ్ ఆసుపత్రి కూడలిలో కీలకమైన ప్రాంగణం


బొమ్మనహళ్లి స్టేషన్.. ఐటీ ఉద్యోగులకు కీలకం

సిద్ధుతో సండూరు నేతల చర్చలు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : సండూరు విధానసభ నియోజకవర్గ ఉప ఎన్నికల వేళ.. ఆ ప్రాంత కాంగ్రెస్ పార్టీ నేతలు శనివారం బెంగళూరులో ముఖ్యమంత్రి సిద్ధరామయ్యతో చర్చలు జరిపారు. ఈ బృందానికి కార్మిక శాఖమంత్రి సంతోష్‌లాడ్ నాయకత్వం వహించారు. ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఎంపికపై కీలకంగా చర్చించారు. కొందరి పేర్లపై విశ్లేషించారు. అభ్యర్థి ఎవరైనా కాంగ్రెస్ విజయానికి శ్రమిస్తామని నేతలంతా హామీనిచ్చారు.


సిద్ధరామయ్యను కలిసిన మంత్రి సంతోష్‌లాడ్, సండూరు కాంగ్రెస్ నేతలు

విద్యాభివృద్ధితోనే సమాజ ప్రగతి

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : సమాజంలో సమానత కోసం బాలలంతా విద్యావంతులుగా ఎదగాలని, కష్టపడి ఉన్నత శిఖరాలు అందుకుంటే కుటుంబం ప్రగతిబాట పడుతుందని ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. బెంగళూరు రవీంద్ర కళాక్షేత్రలో కర్ణాటక రాష్ట్ర తిగళర (వహ్నికుల క్షత్రియ) సంఘం శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి, చక్కని ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందించి, అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య సాయంతోనే సమాజంలో మార్పు సాధ్యమన్నారు. ప్రగతికి అదే ఊతమిస్తుందని చెప్పారు. వహ్నికుల క్షత్రియ వర్గం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు సిద్ధమని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బాలయోగి సాయిమంజునాథ్‌స్వామి, ప్రణవానందపుర మహాస్వామి, మాజీ ఎమ్మెల్సీ పీఆర్ రమేష్, యలహంక నగరసభ మాజీ అధ్యక్షుడు యు.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


ప్రతిభ పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ తదితరులు

కోడికత్తితో భార్య గొంతుకోసి..

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : భార్య నడవడికను అనుమానించి కోళ్లను కోసే కత్తితో హత్య చేసి పరారైన శ్రీనివాస్ (52)ను బాగలూరు ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. యలహంక తాలూకా, బూదిగెరె సమీపంలోని సింగహళ్లిలో కోడి మాంసం విక్రయించుకునే దుకాణాన్ని శ్రీనివాస్ నిర్వహించేవాడు. శుక్రవారం రాత్రి భార్య సుధ (50)ను హత్య చేసి పరారయ్యాడు. అతని కుమారుడు అర్జున్ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కార్యాచరణ నిర్వహించి హంతకుడ్ని అరెస్టు చేసి విచారణ చేపట్టారు.

ఇద్దరు కారాగారాధికారులపై వేటు

కలబురగి : కలబురగి కారాగారంలో ఒక ఖైదీకి చరవాణిని అందించిన ఆరోపణలు రుజువు కావడంతో శహనాజ్, పాండురంగ హరవాళ అనే జైలర్లను సస్పెండ్ చేస్తూ కారాగార శాఖ ఏడీజీపీ మాలిని కృష్ణమూర్తి ఆదేశాలు జారీ చేశారు. కారాగారం నుంచి బయటి వ్యక్తులకు ఫోన్ చేసి నగదు కోసం బెదిరించడం, హనీట్రాప్‌ను చేయిస్తున్న ఆరోపణలపై కారాగారంలో చేసిన సోదాల్లో ఫోను దొరికింది. ఖైదీని విచారణ చేయగా.. తనకు అది ఎలా వచ్చిందో చెప్పడంతో, వారిద్దరినీ సస్పెండ్ చేసి, విచారణకు ఆదేశించారు.

దారిదోపిడీ దారులపై ప్రతిదాడి

బెంగళూరు (శివాజీనగర) : మెట్రో రైలు దిగి, ఫోన్‌లో స్నేహితునితో మాట్లాడుకుంటూ వెళుతున్న అభిజిత్ అనే టెకీని దోచుకునేందుకు శుక్రవారం రాత్రి విఫలయత్నం జరిగింది. ఒకే బైకులో వచ్చిన ముగ్గురు ఆగంతకులు అభిజిత్‌పై దాడి చేసి, అతని చరవాణిని లాక్కొనేందుకు ప్రయత్నించారు. వారిపై ప్రతిదాడికి దిగడంతో నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. బాధితుని ఫిర్యాదు మేరకు గోవిందరాజనగర ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

బోల్తా కొట్టిన ఇథనాల్ ట్యాంకర్

దావణగెరె : ముంబయి నుంచి బెంగళూరుకు వస్తున్న ఇథనాల్ నింపిన ట్యాంకర్ దావణగెరె శివార్లలో శనివారం ఉదయం బోల్తా కొట్టింది. ట్యాంకర్ క్యాబిన్ నుంచి బయటకు దూకి డ్రైవరు ప్రాణాలు దక్కించుకున్నాడు. సకాలంలో అక్కడకు చేరుకున్న సిబ్బంది ట్యాంకర్ నుంచి లీకవుతున్న ఇథనాల్‌ను నిలిపి ప్రమాదాన్ని తప్పించారు. క్రేన్ సహాయంతో ట్యాంకర్‌ను మళ్లీ రహదారిపైన నిలిపారు. దావణగెరె గ్రామీణ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వంచకులకు కటకటాలు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : షేరు మార్కెట్‌లో పెట్టుబడుల పేరిట వంచనలకు పాల్పడుతూ తప్పించుకుని తిరుగుతున్న ముగ్గురిని హైదరాబాద్‌లో అరెస్టు చేసి నగరానికి తీసుకువచ్చామని నగర పోలీసు కమిషనర్ దయానంద్ వెల్లడించారు. అమన్, గురుభాయ్, భరత్ భాయ్ అనే వ్యక్తులను నిందితులుగా గుర్తించారు. 'గ్రీన్ భారత్ లిమిటెడ్' అనే కంపెనీ షేర్లపై పెడితే పెద్ద మొత్తంలో రాబడి, లాభాలు వస్తాయని వీరు ప్రచారం చేసుకున్నారని చెప్పారు. హెచ్‌ఎస్‌ఆర్ లేఅవుట్‌కు చెందిన ఒక శ్రీమంతుడి నుంచి రూ.35.35 లక్షల నగదును తమ ఖాతాలకు బదిలీ చేయించుకున్నారని తెలిపారు. బాధితుని ఫిర్యాదుతో దర్యాప్తు చేపట్టి ముగ్గురిని అరెస్టు చేశామన్నారు. పరారీలో ఉన్న ఇతర నిందితుల కోసం పోలీసులు గాలింపు తీవ్రం చేశారు.

ప్రమాదంలో విద్యార్థి మృతి

శివమొగ్గ, న్యూస్‌టుడే : తీర్థహళ్లి తాలూకా బెజ్జవళ్లి కూడలి సమీపంలో శుక్రవారం ఉదయం సంభవించిన రోడ్డు ప్రమాదంలో ప్రథమ్ (16) అనే డిప్లొమా విద్యార్థి మరణించాడు. రోడ్డు దాటుతున్న అతన్ని ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానిక ఆసుపత్రిలో ప్రథమ చికిత్స ఇచ్చి, మంగళూరు వెన్‌లాక్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో అతను మరణించాడు. తీర్థహళ్లి గ్రామీణ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

విశ్వకళా చిత్ర సంభ్రమం

ప్రదర్శనకు చక్కని స్పందన


చనిపోయిన సీతాకోకచిలుకను మోసుకుని వెళుతున్న చీమలు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : దేశ, విదేశాలకు చెందిన ఛాయాచిత్రగ్రాహకులు తీసిన ఫొటోలను బెంగళూరులోని ప్రభుత్వ చిత్రకళా పరిషత్తులో యూత్ ఫొటోగ్రఫిక్ సొసైటీ శనివారం ప్రదర్శనకు ఉంచింది. ఈ ఏడాది పోటీలకు 38 దేశాలకు చెందిన 257 మంది ఔత్సాహిక ఛాయాచిత్రగ్రాహకులు 3,227 ఫొటోలను పోటీకి పంపించారు. ఎనిమిది మంది విదేశీ, నలుగురు భారతీయ న్యాయనిర్ణేతలు కలర్, హెరిటేజ్ ఆఫ్ ది వరల్డ్, మోనోక్రోమ్, నేచర్ విభాగాల్లో ఉత్తమ ఛాయాచిత్రాలు తీసిన విజేతలను ఎంపిక చేశారు. వాటితో పాటు, వందకుపైగా అత్యుత్తమ చిత్రాలను ప్రదర్శనలో ఉంచామని వైపీఎస్ కార్యనిర్వాహక సమితి అధ్యక్షుడు మంజు వికాస్ శాస్త్రి తెలిపారు. హాంగ్‌కాంగ్‌కు చెందిన దయానాచాన్, అరుణ్ ప్రకాశ్, ఇన్ లే వాన్, సుబ్రత బైసాక్ నాలుగు విభాగాల్లో బంగారు పతకాలను అందుకోనున్నారు. వివిధ విభాగాల్లో నవీనా మోహన్, హెచ్.సతీశ్, రాజశేఖర్, జయేశ్, ప్రసాద్ మంత్రి తదితరులు ఆయా విభాగాల్లో విజేతలుగా నిలిచారని తెలిపారు. ఒక్కో విభాగంలో ఆరుగురు చొప్పున మొత్తం 24 మందికి పతకాలు, ప్రశంసపత్రాలు, బహుమతులను ఆదివారం ప్రదానం చేయనున్నారు. అడోబీ సీఎఫ్‌ఓ రఘురామ్ కృష్ణన్, యువజన సేవలు, క్రీడా శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎంసీ రమేశ్ బహుమతులను ప్రదానం చేస్తారని ఆయన వివరించారు.


తిరిగి రాని బాల్యం. నీటి ప్రవాహంలో ఆట... ఉల్లాసాల గలాటా!


పురుగును నోట కరచుకొని వచ్చిన పిట్టను చూస్తున్న మరో పిట్ట


ప్రదర్శనలో ఉంచిన ఛాయాచిత్రాలను వీక్షిస్తున్న సందర్శకులు


తెల్లపులి

బన్నేరుఘట్టకు తెల్లపులి!

బెంగళూరు (కెంగేరి), న్యూస్‌టుడే : రాజధాని నగర శివారు బన్నేరుఘట్ట జీవ ఉద్యానవనానికి కొత్త అతిథులు విచ్చేశాయి. కేంద్ర మృగాలయ ప్రాధికార ప్రాణుల వినిమయం పథకంలో భాగంగా పాట్నా మృగాలయం నుంచి రెండు మొసళ్లు, ఆరేళ్ల తెల్లపులి, అడవి పిల్లి ఇక్కడికి చేరుకున్నాయి. ఐదు రోజుల ప్రయాణం తర్వాత ఆ వన్యప్రాణులు ఉద్యాననగరంలో కాలుమోపాయి. వీటికి ప్రత్యామ్నాయంగా పాట్నాకు జీబ్రా, థమిన్ జింకలను పంపించారు. జంతువుల సరఫరా సమయంలో సంబంధిత వాహనానికి తెలంగాణ పరిధిలో ప్రమాదం వాటిల్లినా.. ఎలాంటి నష్టం కలగలేదు. అరణ్యాధికారులు సురక్షితంగా వాటిని తరలించుకొచ్చారు. వీటిని ముందుజాగ్రత్తగా 45 రోజుల పాటు క్వారంటైన్‌లో ఉంచారు. ఇక్కడి వాతావరణానికి అలవాటు పడ్డాక.. సందర్శకులు వీక్షించేందుకు అవకాశం కల్పిస్తారు.


మొసలి

'కుడ్య' కళాతరంగాలు

'గోడె బెంగళూరు' షురూ

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : ఉద్యాననగరిలోని పలు ప్రాంతాల్లో గోడలను సుందరంగా మార్చివేసేందుకు అన్‌బాక్సింగ్ ఫౌండేషన్, బీఎంఆర్‌సీఎల్ సంస్థలు ముందుకు వచ్చాయి. 'గోడె బెంగళూరు' పేరిట నగర సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలు, పండగలు, కళ తదితరాలను ప్రతిబింబించే చిత్రాలను మెట్రో స్టేషన్లు, మెట్రో రైలు కొనసాగే మార్గంలోని రహదారుల్లోని గోడలపై చిత్రించనున్నారు. ఈ చిత్రాలను పూర్తి చేయడంతో పాటు నవంబరు 30 నుంచి డిసెంబరు 15 వరకు 'బెంగళూరు హబ్బ'ను ఆచరించేందుకు అన్‌బాక్సింగ్ ఫౌండేషన్ సన్నాహాలు చేసుకుంటోంది. పది మంది కళాకారులు తమ సహాయకులతో కలిసి బొమ్మలు వేయడాన్ని ప్రారంభించారు. వీరు వేస్తున్న చిత్రాలను సురేశ్ జయరామ్, అర్చనా హండె, రవికుమార్ కాశి పర్యవేక్షిస్తున్నారు. ఉత్తమ చిత్రాలు వేసిన కళాకారులను 'బెంగళూరు హబ్బ' సమయంలో సత్కరిస్తామని ఫౌండేషన్ ప్రతినిధి కామిని సాహ్ని తెలిపారు. గోడలు సుందరంగా ఉంటే, పాదచారులు, నగరానికి వచ్చే పర్యాటకులకు చక్కని అనుభూతిని ఈ చిత్రాలు అందిస్తాయని ఆమె ధీమా వ్యక్తం చేశారు.


గోడపై చిత్రాన్ని పూర్తి చేస్తున్న కళాకారుడు

శ్రవణానందంగా కథావేదిక

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : భారతీయ పౌరాణిక కథలు, గాథలను 'మైథాలజీ మార్వెల్స్- సింప్లీ శక్తి' పేరిట బాలలు, వారి కుటుంబ సభ్యులకు వినిపించేందుకు 'ఆట గలాట' కళావేదికపై శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి చక్కని స్పందన లభించింది. కళాకారులు లావణ్య ప్రసాద్, మీను శివరామకృష్ణన్ మూడు గంటల పాటు వివిధ పౌరాణిక గాథలు, కథలతో సభ్యులు, కార్యశాలకు హాజరైన కుటుంబాలను అలరించారు. సంగీతం, నృత్యంతో రూపకంలా ప్రదర్శించిన ప్రదర్శనకు చక్కని స్పందన లభించింది.


నాటకీయంగా కథను వినిపించే ప్రయత్నం..

పనిచేసే సంస్థకే మోసం

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : తాము పని చేస్తున్న కంపెనీని వంచిస్తున్న ఒక అసిస్టెంట్ మేనేజరు, అతని ముగ్గురు అనుచరులను ఆగ్నేయ విభాగం సైబర్ ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. నిందితులను శ్రేయస్, కౌశిక్, రంగనాథ్, ఆనంద్‌గా గుర్తించారు. పోర్టర్ కంపెనీ యాప్‌లో నకిలీ కస్టమర్, డ్రైవర్ల ఐడీలను సృష్టించి కంపెనీకి రూ.90 లక్షల వరకు వంచించారని నగర పోలీసు కమిషనర్ దయానంద్ తెలిపారు. వీరు కర్ణాటకతో పాటు తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్‌లోనూ ఇదే తరహా వంచనలకు పాల్పడ్డారని ప్రాథమిక దర్యాప్తులో గుర్తించామని చెప్పారు.

కారాగారంలో మత్తుమందులా?

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : పరప్పన అగ్రహార కారాగారంలో ఖైదీలు చరవాణి, గంజాయి వినియోగించడాన్ని ఉన్నత న్యాయస్థానం తీవ్రంగా పరిగణించింది. హత్య కేసులో అరెస్టయిన సోమశేఖర్ అనే ఖైదీ కారాగారం నుంచి బయట వ్యక్తులకు ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై కారాగారం జైలర్‌ను, ఇతర అధికారులను విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఐజీపీని న్యాయస్థానం ఆదేశించి, తదుపరి విచారణను వాయిదా వేసింది.

మళ్లీ.. భయపెట్టిన వాన


కుటుంబ సభ్యులతో కలిసి ట్రాఫిక్ ఐల్యాండ్ ఆగిన వ్యక్తి

బెంగళూరు గ్రామీణ, న్యూస్‌టుడే : వానదేవుడు మరోసారి భయపెట్టాడు. శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు బెంగళూరు నగరంలో ఎండ తీవ్రత ఎక్కువగా అనిపించింది. ఉన్నట్టుండి మబ్బులు కమ్ముకోవడంతో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. సాయంత్రం కొంత సమయం వర్షం తెరపి ఇచ్చినా, మళ్లీ ఆకాశానికి చిల్లులు పడినట్లు వరుణుడు కుండపోతను కురిపించాడు. ఈ వర్షంతో పలు ప్రాంతాల్లో విద్యుత్తు ప్రసారం నిలిచిపోయింది. అంతర్జాల సేవలు స్తంభించాయి. వర్షం కాస్త ఆగినప్పుడు ఒకేసారి వాహనాలన్నీ బయటకు రావడంతో పలు ప్రాంతాల్లో వాహన రద్దీ నెలకొంది. వర్షం కురుస్తున్న సమయంలో మధ్యాహ్నమే చీకట్లు అలుముకున్నాయి. నగరంలో శనివారం ఎల్లో అలర్ట్ కొనసాగింది. సోమవారం నుంచి బెంగళూరు, బెంగళూరు గ్రామీణం, చుట్టుపక్కల మరో ఐదు జిల్లాల్లో ఎల్లో, ఆరెంజ్ అలర్ట్ ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు


భారీ వర్షంలో విద్యుత్తు బైకుపై వెళుతున్న యువకుడు


దీపాలు వేసుకుని వెళుతున్న వాహనదారులు

రామప్రసాద్ స్మారక క్రికెట్ పోటీలు

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : కర్ణాటక క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో కె.రామప్రసాద్ షీల్డ్ కోసం నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలో వైదేహి పాఠశాల జట్టు 28 పరుగుల తేడాతో ఏసీ పాఠశాల జట్టుపై గెలుపొంది సెమీస్‌కు చేరుకుంది. శనివారం నగరంలోని వేర్వేరు మైదానాల్లో జరిగిన ఈ పోటీలో మొదట బ్యాటింగ్ చేసిన వైదేహి జట్టు నిర్ణీత 30 ఓవర్లలో 8-195 పరుగులు సాధించింది. ఏసీ జట్టు 30 ఓవర్లలో 7-167 పరుగులు మాత్రం చేసింది. ఇతర క్వార్టర్ ఫైనల్స్‌లో రవిశంకర్ విద్యామందిర్ జట్టు ఐదు పరుగుల తేడాతో యలహంక జట్టుపై గెలుపొందగా, యశ్వంతపుర నేషనల్ పబ్లిక్ స్కూల్ జట్టు ఎనిమిది వికెట్లతో బెంగళూరు ఎన్‌పీ స్కూల్ జట్టుపై, విద్యానికేతన్ జట్టు ప్రత్యర్థి విద్యాభారతి జట్టుపై నాలుగు వికెట్లతో గెలుపొందాయి. విజేత జట్లు సెమీ ఫైనల్స్‌కు చేరాయి.

బెంగళూరు

•బెంగళూరు •హోసూరు

మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా జాతా

చిక్కబళ్లాపుర, న్యూస్‌టుడే : మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా ప్రజాజాగృతి కోసం నాగార్జున కళాశాల విద్యార్థులు చిక్కబళ్లాపురలో జాతా నిర్వహించారు. చిన్నయ్య ఉద్యానం నుంచి జీవిత బీమా కార్యాలయం వరకు కొనసాగిన జాతాలో ముంబయికి చెందిన మూమెంట్ ఇండియా కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం స్థానికంగా ప్రజా జాగృతి కల్పించారు.



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు



రామచంద్రాపురలో వర్షంలో తడుస్తున్న ప్రయాణికులు



రామయ్య కాలనీల్లో వాగులా కనిపిస్తున్న రహదారి



మత్తికెరె ప్రధాన రహదారిలో పరిస్థితి ఇలా..

తెరపివ్వని వాన.. మగ్గుతున్న జనాలు

బెంగళూరు (జాలహళ్లి), న్యూస్‌టుడే : నగరంలో కురుస్తున్న భారీ వానకు నగర ప్రజలు అల్లాడిపోతున్నారు. ఇక్కడి బ్యాట్రాయణపుర, దాసరహళ్లి, ఆర్.ఆర్.నగర నియోజకవర్గాల్లోని రామచంద్రాపుర, తిండ్లు, దొడ్డబొమ్మసంద్ర, విద్యారణ్యపుర , రామయ్య బడవాణి, దేవప్ప లౌట్, గంగమ్మసర్కల్, బీఈఎల్ కాలనీ, జాలహళ్లి, కళానగర, గోవిందపుర తదితర ప్రాంతాల్లోని రహదారులు వాగులను తలపించేలా ప్రవహిస్తున్నాయి. లోతట్టు మురికివాడ ప్రాంతాల్లో ఇళ్లలోకి వర్షం నీరు చేరటంతో ప్రజలు సమీపంలోని పాఠశాలల్లో ఆశ్రయం పొందుతున్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానకు వ్యాపారులు, ప్రయాణికులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జోరువానలో ఇంటి నుంచి బయటకు రావటానికి ప్రజలు వెనుకంజ వేస్తున్నారు. బీబీఎంపీ సిబ్బంది పలు ప్రాంతాల్లో వర్షపు నీటిని చెరువులకు మళ్లించారు. వర్షాలకు కొన్ని ప్రాంతాల్లో విద్యుత్తు అంతరాయం ఏర్పడడంతో నివాసులు చీకట్లో మగ్గుతున్నారు. ఇళ్లన్నీ కొవ్వొత్తులు, చరవాణులు దీపాల వెలుగులతో కనిపిస్తున్నాయి. ఎలాంటి ప్రాణనష్టం లేదని అధికారులు తెలిపారు

కావేరి తాగునీటి కోసం దరఖాస్తు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : బృహత్ బెంగళూరు మహానగర పాలికె పరిధిలో విలీనమైన 110 గ్రామాల్లో నివశించే ప్రజలు కావేరి తాగునీరు సరఫరా కోసం అన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని బెంగళూరు జలమండలి అధ్యక్షుడు రామ్ ప్రసాద్ మనోహర్ తెలిపారు. సరఫరా కోసం దరఖాస్తు చేసుకున్న 15 రోజుల నుంచి 45 రోజుల్లోగా అనుమతులు ఇస్తామన్నారు. ఇప్పటికే 55 వేల మంది దరఖాస్తు చేసుకున్నారని, ఇంకా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించినట్లు వివరించారు. కొత్త వసతి నివాస కట్టడాలకు చదరపు మీటరుకు రూ.400, వాణిజ్య కట్టడాలకు రూ.600 రుసుం వసూలు చేస్తారని ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు నగరపాలికె అధికారులకు సహకరించాలని రామ్ ప్రసాద్ మనోహర్ కోరారు.

హోసూరు కబుర్లు

అభివృద్ధి పనులకు శ్రీకారం

హోసూరు, న్యూస్‌టుడే : హోసూరు నియోజకవర్గం పరిధిలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. హోసూరు తాలూకాలో గ్రామాల అభివృద్ధికి నాబార్డు అందించిన రూ.1.24 కోట్ల వ్యయంతో చేపట్టిన పనులకు హోసూరు ఎమ్మెల్యే వై.ప్రకాష్ భూమి పూజ చేశారు. నందిమంగలంలో రూ.44 లక్షలతో నీళ్ల ట్యాంక్, పెరుమాళపల్లిలో రూ.18 లక్షలతో ట్యాంక్, క్వారీ, క్రషర్స్ నిధుల నుంచి రూ.14.31 లక్షల వ్యయంతో కనిమంగలం, కగ్గనూరు, కూస్తనపల్లిలో అంగనవాడీ భవనాల నిర్మాణాలకు పూజలు చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో డీఎంకే నాయకులు గజేంద్రప్ప, త్యాగరాజన్, రమేష్, కలై చెజియన్, అధికారులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్ తదితరులు

దొంగ అరెస్టు : బంగారు, నగదు స్వాధీనం

హోసూరు, న్యూస్‌టుడే : హోసూరు రైల్వేస్టేషన్ వెనుక నివసిస్తున్న రమేష్ ఇంట్లో గత మార్చి 15న దొంగతనం జరిగింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి తాళాలు పగులగొట్టి నగలు, నగదు దోచుకెళ్లారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. హోసూరు ఎస్పీ తంగదురై, అక్షయ అనిల్ వాకరే ప్రత్యేక దృష్టి సారించి దొంగల కోసం ప్రత్యేక బృందం ఏర్పాటు చేశారు. పట్టణ ఇన్‌స్పెక్టర్ నాగరాజన్, సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రభాకరన్ సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడు మైసూరులోని రాజీవ్ నగర్‌కు చెందిన అబుబాకర్ (46)గా గుర్తించి అరెస్టు చేశారు. గత ఏడాది సిప్‌కాట్ పరిధిలోని శాంతపురం సెంతమిళ్ నగరులో దొంగతనాలు చేసినట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. నిందితుని నుంచి 120 గ్రాముల బంగారు నగలు, రూ.5 లక్షల నగదు స్వాధీనం చేసుకొన్నారు.



నిందితుడితో పోలీసులు

ఆటోడ్రైవర్లకు భాజపా సభ్యత్వం

హోసూరు, న్యూస్‌టుడే : హోసూరు రింగు రోడ్డులోని భాజపా జిల్లా కార్యాలయంలో అణ్ణానగరు సురేశ్ నేతృత్వంలో శనివారం ఆటోడ్రైవర్లు భాజపా సభ్యత్వం స్వీకరించారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ పని తీరుకు ఆకర్షితులై భాజపాలో చేరినట్లు సురేశ్ తెలిపారు. భాజపా జిల్లా అధ్యక్షుడు ఎం.నాగరాజు భాజపా కండువాలు కప్పి సభ్యత్వం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



భాజపాలో చేసిన ఆటో డ్రైవర్లు

శ్మశానవాటికకు రహదారి ఏర్పాటు

హోసూరు, న్యూస్‌టుడే : హోసూరు కార్పొరేషన్ పరిధి 44వ వార్డు మత్తిగెరి, కర్నూరు గ్రామాలకు కార్పొరేటర్ మంజుల మునిరాజు వార్డు అభివృద్ధికి కృషి చేస్తున్నారు. గత కొన్ని రోజులుగా వర్షం కురుస్తున్నందున కర్నూరు శివారు శ్మశాన రహదారి బురదమయమైంది. ఈ రహదారికి అడ్డంగ శాటిలైట్ రింగ్ రోడ్డు నిర్మాణం పనులు జరుగుతున్నందున శ్మశాన భూమికి వెళ్లడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. శనివారం కర్నూరుకు చెందిన వ్యక్తి అనారోగ్య కారణంగా మృతి చెందారు. మృతదేహాన్ని తీసుకెళ్లడానికి కుటుంబ సభ్యులు ఇక్కట్లు పడ్డారు. విషయం తెలిసిన కార్పొరేటర్ మంజుల మునిరాజు స్థలానికి వెళ్లి జేసీబీ ద్వారా స్వంత ఖర్చుతో రహదారిని శుభ్రం చేయించారు.



జేసీబీ ద్వారా జరుగుతున్న రహదారి పనులు

జాతీయ తెలుగు కవితల పోటీలకు ఆహ్వానం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : కర్ణాటక తెలుగు రచయితల సమాఖ్య జాతీయ తెలుగు కవితల పోటీ-2024లకు తెలుగు రచయితలు, కవులు, సాహితీవేత్తలు, యువకవుల నుంచి 'నేటి రాజకీయ స్థితిగతులు' అనే అంశంపై కవితలను ఆహ్వానిస్తున్నట్లు సమాఖ్య ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు సమాఖ్య ఛైర్మన్ డాక్టర్ మాల్యాద్రి బొగ్గవరపు, అధ్యక్షుడు మరంగంటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సింగూరు నరేంద్రబాబు ఒక ప్రకటన విడుదల చేశారు. నాలుగు ఉత్తమ కవితలకు రూ.750 చొప్పున నగదు బహుమతులు, నాలుగు ప్రశంసనీయ కవితలకు ప్రోత్సాహక బహుమతి కింద రూ.500 చొప్పున అందిస్తామన్నారు. కవితలను నవంబరు 4లోగా చరవాణి సంఖ్య : 9538400022కు పంపించాలని సూచించారు. సమాఖ్య విధించిన నిబంధనలు అన్ని కవితలకు వర్తిస్తాయని వివరించారు.

రోగికి పీఎస్‌ఐతో ప్రాణదానం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : గుండెపోటుకు గురైన 72 ఏళ్ల వృద్ధుడికి నగరంలోని ఆస్టర్ సీఎంఐ ఆసుపత్రి హృదయరోగ నిపుణుడు డాక్టర్ సంజయ్‌భట్ నూతన మధ్యంతర విధానం ద్వారా చికిత్స అందించి ప్రాణాలు కాపాడారు. గుండెలోని ఎడమ రక్త నాళంలో రక్తప్రసరణ నిలిచి పోవడంతో పెక్కు టీవియస్ (పీఎస్‌ఐ) విధానం ద్వారా చికిత్స చేసి రక్తప్రసరణను పునరుద్ధరించినట్లు సంజయ్‌భట్ తెలిపారు. ఇది దేశంలో అరుదైన చికిత్సా విధానమన్నారు. ఈ విధానం ద్వారా ఎడమ రక్తనాళం యథాస్థితికి వచ్చిందని ఆయన వివరించారు.

నగరంలో ఈనాడు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే :

- ఉదయం 10.30 గంటలకు కాక్స్‌టౌన్-దొడ్డగుంటె మౌనగురు మఠం కృష్ణసేవా సంఘం ఏర్పాటు చేసే దసరా ఉత్సవాలను ప్రతిపక్ష నేత ఆర్.అశోక్ ప్రారంభిస్తారు. ఎంపీ పీసీ మోహన్, ఎమ్మెల్యే ఎస్.రఘు, సినీనటులు తారా అనురాధ, నికితస్వామి తదితరులు హాజరవుతారు.
- ఉదయం 11 గంటలకు రాజప్రస్థానం మైదానం త్రిపురవాహినిలో జ్యువెల్స్ ఆఫ్ ఇండియా బంగారు నగలు, వజ్రాభరణాల ప్రదర్శన కొనసాగుతుంది.
- ఉదయం 10 గంటలకు రాజాజీనగర రామమందిరం మైదానంలో ఆభయ సేవా ఫౌండేషన్ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తుంది.
- ఉదయం 10 గంటలకు రాజాజీనగరలో కె.ఎల్.ఈ సొసైటీ ఎస్.నిజలింగప్ప కళాశాల వజ్రమహోత్సవం సందర్భంగా ఇంజనీరింగ్ విద్యార్థులకు మెగా ఉద్యోగ మేళాను నిర్వహించనుంది.
- సాయంత్రం 5 గంటలకు కుమారకృపా రహదారిలోని గాంధీభవన్‌లో మానవహక్కుల కార్యకర్త ప్రొఫెసర్ జి.ఎన్.సాయిబాబా శ్రద్ధాంజలి కార్యక్రమాన్ని కర్ణాటక శ్రమిక శక్తి, పీడీఎఫ్, పీయూసీఎల్ తదితర సంస్థలు ఏర్పాటు చేశాయి. అడ్వకేట్ ఎస్.బాలన్, అరవింద నారాయణ, శివసుందర్ ప్రసంగిస్తారు.

ఫిర్యాదులపై న్యాయమూర్తి విచారణ

తుమకూరు, న్యూస్‌టుడే : తుమకూరు జిల్లాలోని కుణిగల్ తాలూకా హులియూరుదుర్గ గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారి ఆర్.వినాయక తప్పుడు దాఖలాలు సృష్టించి ప్రజలను మోసగించారనే ఫిర్యాదుపై ఉప లోకాయుక్త న్యాయమూర్తి బి.వీరప్ప విచారణ చేపట్టారు. జిల్లా పంచాయతీ సభాప్రాంగణంలో కేసులను విచారించారు. పీడీవో వినాయకను ప్రశ్నించగా సరైన దాఖలాలు ఇవ్వక పోవడంతో పాటు సమాధానం చెప్పలేక తడబడ్డారు. ఫిర్యాదుదారుడి సమక్షంలో కేసు విచారణ చేపట్టిన న్యాయమూర్తి పీడీవో వినాయకను హెచ్చరించారు. సామాన్యులను మోసగించడం నేరమని, కఠిన చర్యలు తప్పవన్నారు. సమస్యలపై వచ్చే అర్జీలను జాప్యం చేయకుండా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లాధికారి శుభాకల్యాణ్, ఎస్పీ, సీఈఓ తదితరులు పాల్గొన్నారు.



కేసులను విచారిస్తున్న న్యాయమూర్తి, జిల్లాధికారి

చెస్ సంఘం రాష్ట్ర అధ్యక్షునికి ఘన సత్కారం

తుమకూరు, న్యూస్‌టుడే : సేవా సాధకులు ఉన్నతమైన స్థానాలు పొందినప్పుడు గౌరవించడం మన సాంప్రదాయమని హిరేమఠం శివానందశివాచార్య స్వామీజీ పేర్కొన్నారు. రాష్ట్ర చదరంగం సంఘం అధ్యక్షుడిగా ఎంపికైన తుమకూరు జిల్లాకు చెందిన టి.ఎన్.మధుకర్‌ను వెనుకబడిన ఒక్కూటం ఆధ్వర్యంలో కన్నడ భవనంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ మధుకర్ ఎంపిక కావడం తుమకూరు జిల్లాకు గర్వకారణం అన్నారు. తుమకూరు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఎం.వెంకటేశ్వరులు మాట్లాడుతూ మనస్సు ఏకాగ్రత పొందడానికి చదరంగం ఉపకరిస్తుందన్నారు. కార్యక్రమంలో జాతీయ మానవ వేదిక అధ్యక్షుడు టి.ఆర్.అంజినప్ప, ప్రజాప్రగతి ఎడిటర్ ఎస్.నాగణ్ణ, జిల్లా వెనుకబడిన వర్గాల అధ్యక్షుడు ధనియాకుమార్, జిల్లా కన్నడ సాహిత్యపరిషత్ అధ్యక్షుడు సిద్ధలింగప్ప, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు సణ్ణముద్దయ్య, పాత్రికేయుల సంఘం అధ్యక్షుడు పురుషోత్తమ్ ప్రదీప్‌కుమార్, డి.ఎం.సతీష్, శాంతరాజు, ఎస్.హరీష్ ఆచార్య మంజేష్ తదితరులు పాల్గొన్నారు.



మధుకర్‌ను సత్కరిస్తున్న స్వామీజీ, ఉపకులపతి తదితరులు

పోలీసులే సహకరించారు

కలబురగి: కర్ణాటక పరీక్ష ప్రాధికార నిర్వహించిన పరీక్షల్లో అక్రమాలకు ప్రధాన సూత్రధారి ఆర్‌డీ పాటిల్ పరారయ్యేందుకు పోలీసులు సహకరించారని ఉన్నతాధికారుల దర్యాప్తులో గుర్తించారు. కారాగారం నుంచి బెయిలుపై బయటకు వచ్చిన ఆర్‌డీ పాటిల్ మళ్లీ విచారణకు హాజరు కాలేదు. న్యాయస్థానం అనుమతితో పోలీసులు గాలింపు కొనసాగించారు. గత ఏడాది నవంబరు ఆరున వరదా నగరలోని ఒక అపార్ట్‌మెంట్ ఫ్లాట్‌లో పాటిల్ ఉన్నట్లు దర్యాప్తు దళం గుర్తించింది. వారు అక్కడికి చేరుకునేలోగా కొందరు పోలీసులు, పోలీసు ఇన్ఫార్మర్లు పాటిల్‌కు సమాచారం అందించి.. పరారయ్యేందుకు సహకరించారని తేలిం ది. అనంతరం కొద్ది రోజులకు పాటిల్ దొరికిపోయాడు. పోలీసులే తాను పరారయ్యేందుకు సహకరించారని నోరు విప్పడంతో గుట్టు రట్టయింది. ఈ వివరాలను న్యాయస్థానంలో దాఖలు చేసిన అభియోగపత్రంలో పోలీసులు పొందుపరిచారు.

యత్నాల్‌పై కేసు నమోదు

విజయపుర, న్యూస్‌టుడే : లోక్‌సభలో విపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్‌లను అనుచిత పదజాలంతో దూషించిన ఆరోపణలపై భాజపా ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్, మరికొందరిపై గాంధీచౌక్ ఠాణాలో కేసు నమోదైంది. విజయపుర పాలికెలో నామినేటెడ్ సభ్యుడు పరశురామ హోసమి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదైంది.

జాతీయ ఫుట్‌బాల్ పోటీలో కర్ణాటక సత్తా

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : పశ్చిమబెంగాల్ నాడియాలో జరుగుతున్న జాతీయ సీనియర్ మహిళల ఫుట్‌బాల్ పోటీలో కర్ణాటక జట్టు తొలి విజయం సాధించి చక్కని శుభారంభం చేసిందని కర్ణాటక ఫుట్‌బాల్ సంఘం తెలిపింది. టోర్నమెంట్ తొలి పోటీలో కర్ణాటక 13-0 గోల్స్‌తో జమ్ము-కాశ్మీర్‌పై విజయం సాధించింది. కర్ణాటక జట్టులో ఎం.హేమ, అరుషీసంతోష్, తనుశ్రీరై తలా మూడు, సుసన్‌థామస్, రివ్‌కా, అఫ్రిన్, మైత్రేయి పాలసముద్రం తలా ఒక గోల్ సాధించారు.



కర్ణాటక మహిళల జట్టు

దీపావళికి ప్రత్యేక బస్సులు

బెంగళూరు (మత్తికెరె) న్యూస్‌టుడే : దీపావళి పండగ సందర్భంగా ఈనెల 30 నుంచి సాధారణ చార్జీలతో ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు ఏపీఎస్ ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ రవీంద్రారెడ్డి తెలిపారు. తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, కర్నూల్, అనంతపురం, ఒంగోలు, ప్రొద్దుటూరు, విజయవాడ, కావలి, తదితర ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు నడుస్తాయన్నారు. రాను, పోను టికెట్ బుక్ చేసుకుంటే ప్రయాణికులకు 10 శాతం రాయితీ ఇస్తామన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రఘు కౌటిల్యపై ఫిర్యాదు

మైసూరు, న్యూస్‌టుడే: నిబంధనలు ఉల్లంఘించి సీఏ సైటును పొందారని భాజపా నాయకుడు రఘు కౌటిల్యపై నాగేంద్ర అనే వ్యక్తి లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. జి.రంగణ్ణ లక్ష్మమ్మ చారిటబుల్ ట్రస్టు కోసం సోమనాథ నగర లేఅవుట్‌లో 5482 చ.మీ. భూమిని ఆయన మంజూరు చేయించుకున్నారని నాగేంద్ర తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

నటుడు మయూర్‌పై కేసు

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : వివాదంలో ఉన్న 14.5 ఎకరాల భూమికి ఉన్న ప్రహరీని కూల్చివేయించిన ఆరోపణలపై నటుడు మయూర్ పటేల్‌పై హెచ్‌ఎస్‌ఆర్ లేఅవుట్ ఠాణాలో కేసు నమోదైంది. భూవివాదం న్యాయస్థానంలో ఉన్నప్పుడే.. ఆయన దౌర్జన్యానికి పాల్పడ్డారని శాలిని అనే మహిళ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



ఇరు సంస్థల ప్రతినిధులు

రెండు సంస్థల ఒప్పందాలు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : ఉత్పాదన విభాగంలో డిజిటల్ ప్రాజెక్ట్ పరిష్కరణలను అందిస్తున్న ఆటో డెస్కుతో సిన్సిస్ టెక్ లిమిటెడ్ ఒప్పందం కుదుర్చుకుంది. భవన నిర్మాణాలు, మౌలిక సదుపాయాలను కల్పించేందుకు, కృత్రిమ మేధస్సుతో వివిధ రంగాలపై అవగాహన కల్పించేందుకు నిపుణులు, విద్యార్థుల కోసం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని సిన్సిస్ టెక్ లిమిటెడ్ ఉపాధ్యక్షుడు తరుణ్ బిస్త్ తెలిపారు.

తక్కువ ధరలకు వస్తువులు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : దీపావళి పండగ సందర్భంగా అమెజాన్ తక్కువ ధరలకు వివిధ కంపెనీల బ్రాండ్ వస్తువులను అందించేందుకు ఫెస్టివ్ గిఫ్టింగ్ స్టోర్‌ను ప్రారంభించింది. కొనుగోలు చేసే వస్తువులపై 50 శాతం రాయితీతో పాటు రూ.200 నగదు వెనక్కి ఇచ్చే పథకం అమలులోకి తెచ్చినట్లు ఆసంస్థ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. పండగ సందర్భంగా బంధుమిత్రులకు ఇచ్చే కానుకలు తక్కువ ధరలకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

క్రైం కార్నర్

కూరగాయల వ్యాపారి హత్య

రామనగర, న్యూస్‌టుడే : చిన్న విషయంలో స్నేహితులతో గొడవ పడిన కూరగాయల వ్యాపారి ప్రవీణ్ (32) శుక్రవారం రాత్రి హత్యకు గురయ్యారు. మాగడి నిర్మలా టాకీస్ వద్ద మద్యం తాగి వెళుతున్న అతనిపై దాడి చేసిన కొందరు స్నేహితులు తలపై బండ రాయి వేసి హత్య చేసి పరారయ్యారు. మార్కెట్‌లో కూరగాయల విక్రయానికి సంబంధించి వారితో రెండు వారాల క్రితం ప్రవీణ్ గొడవ పడ్డాడు. దాన్ని మనసులో ఉంచుకున్న నలుగురు స్నేహితులు అతన్ని హత్య చేశారని పోలీసులు గుర్తించారు. ప్రవీణ్ భార్య 15 రోజుల క్రితమే ఒక బిడ్డకు జన్మనిచ్చింది. పరారీలో ఉన్న హంతకుల కోసం మాగడి ఠాణా పోలీసులు గాలింపు తీవ్రం చేశారు.

ప్రైవేట్ ఉద్యోగి మృతి

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : హెబ్బాళ ఉపరితల వంతెన సమీపంలో శుక్రవారం రాత్రి సంభవించిన రోడ్డు ప్రమాదంలో అజయ్ మురళి (30) అనే వ్యక్తి మరణించారు. తమిళనాడుకు చెందిన బాధితుడు భద్రప్ప లేఔట్‌లో ఉంటూ ఒక ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నారు. బైకు అదుపు తప్పి కిందపడడంతో తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స కోసం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించారు. హెబ్బాళ ట్రాఫిక్ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

టిప్పర్ ఢీకొని పాదచారి..

హోప్‌ఫారం కూడలి వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మునేకొళలు నివాసి బాబు (48) మరణించారు. రోడ్డు దాటుతున్న ఆయనను వేగంగా వచ్చిన టిప్పర్ ఢీకొనడంతో ప్రమాదం సంభవించింది. బాధితుడిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించేలోగా మరణించారు. ప్రమాదానికి కారకుడైన డ్రైవర్ టిప్పర్‌ను వదిలి పరారయ్యాడు. వైట్‌ఫీల్డ్ ట్రాఫిక్ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఆటో డ్రైవర్..

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : దొడ్డబళ్లాపుర తాలూకా గుంజూరు వద్ద శుక్రవారం రాత్రి సంభవించిన రోడ్డు ప్రమాదంలో మహేశ్ (32) అనే ఆటో డ్రైవర్ మృతి చెందాడు. గౌరీబిదనూరు తాలూకా బచ్చరెడ్డిహళ్లికి చెందిన బాధితుడు ఆటోలో ఇంటికి వెళుతూ, రహదారి పక్కన నిలిపిన లారీని వెనుక నుంచి ఢీకొనడంతో ప్రమాదం సంభవించింది. దొడ్డబళ్లాపుర గ్రామీణ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వాహనాలకు నిప్పు..

మైసూరు, న్యూస్‌టుడే : హుణసూరు తాలూకా ముత్తురాయన హొసళ్లి గ్రామంలో ఇళ్ల ముందు నిలిపి ఉంచిన కొన్ని వాహనాలకు అపరిచితులు నిప్పు పెట్టి పరారయ్యారు. ఇరుగు పొరుగు ప్రజలు మంటల్ని గుర్తించి ఆర్పేలోగా అవి పూర్తిగా దగ్ధమయ్యాయి. మంటల్లో ఒక కారు, సైకిల్, తొమ్మిది రోజుల క్రితం కొనుగోలు చేసిన ద్విచక్ర వాహనం పూర్తిగా కాలిపోయాయి. వాటి యజమాని మను తన కుటుంబ సభ్యులతో కలిసి మైసూరుకు వెళ్లిన సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. హుణసూరు గ్రామీణ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

నిందితుడి అరెస్టు

మైసూరు, న్యూస్‌టుడే : బాడుగకు వచ్చిన ఆటో డ్రైవర్‌ను దోచుకుని పరారైన ఉమేశ్ (28) అనే నిందితుడిని మైసూరు దక్షిణ గ్రామీణ ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. సాగర్ అనే డ్రైవర్‌పై ఈ నెల 10న తన సహచరునితో కలిసి దాడి చేసి అతని ఆటో, చరవాణి, రూ.8500 నగదు దోచుకుని పరారయ్యాడు. బాధితుని ఫిర్యాదుతో హోటగళ్లికి చెందిన నిందితుడ్ని అరెస్టు చేశారు. పరారీలో ఉన్న అతని అనుచరుని కోసం గాలింపు కొనసాగించారు.

ఇద్దరు చోరులు..

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : తాళం వేసిన ఇళ్లలో రాత్రుళ్లు దొంగతనాలకు పాల్పడుతున్న ముంబయి నివాసి జాఫర్ అలి, ఉత్తరప్రదేశ్‌కు చెందిన మల్లిక్‌ను కొడిగేహళ్లి ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.70 లక్షల విలువైన ఆభరణాలు జప్తు చేసుకున్నారు. వీరి అరెస్టుతో కొడిగేహళ్లితో పాటు నగరంలోని వివిధ ప్రాంతాలలో జరిగిన దొంగతనం కేసులను పరిష్కరించామని పోలీసులు తెలిపారు.

బళ్ళారి

• బళ్ళారి • రాయచూరు

పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు హామీ

రాయచూరు, న్యూస్‌టుడే : రాయచూరు, యాదగిరి, సింధనూరులో పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామని కేంద్ర జౌళిశాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ హామీ ఇచ్చారని రాయచూరు మాజీ పార్లమెంటు సభ్యుడు అమరేష్ నాయక్ పేర్కొన్నారు. ఆయన శనివారం పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. రాయచూరు, యాదగిరి జిల్లాల్లోని పత్తి రైతులకు మార్కెట్లో ధర లేకపోవడంతో నష్టపోతున్న విషయాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి త్వరలో కేంద్రాలు తెరిచేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారని తెలిపారు. మద్దతు ధర కోసం రెండు జిల్లాల రైతులు ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే.



నాటకీయంగా కథను వినిపించే ప్రయత్నం..

శ్రవణానందంగా కథావేదిక

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : భారతీయ పౌరాణిక కథలు, గాథలను 'మైథాలజీ మార్వెల్స్- సింప్లీ శక్తి' పేరిట బాలలు, వారి కుటుంబ సభ్యులకు వినిపించేందుకు 'ఆట గలాట' కళావేదికపై శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి చక్కని స్పందన లభించింది. కళాకారులు లావణ్య ప్రసాద్, మీను శివరామకృష్ణన్ మూడు గంటల పాటు వివిధ పౌరాణిక గాథలు, కథలతో సభ్యులు, కార్యశాలకు హాజరైన కుటుంబాలను అలరించారు. నృత్యంతో రూపకంలా ప్రదర్శించిన ప్రదర్శనకు చక్కని స్పందన లభించింది.

ఉద్యోగ మేళాను సద్వినియోగం చేసుకోవాలి



మేళాను ప్రారంభిస్తున్న ప్రముఖులు

రాయచూరు, న్యూస్‌టుడే : ఉద్యోగ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ ప్రథమ శ్రేణి కళాశాల ప్రిన్సిపల్ వెంకన్న పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ ప్రథమ శ్రేణి కళాశాల, దివ్యాంగుల సంస్థ సంయుక్తంగా శనివారం కళాశాలలో ఉద్యోగ మేళా నిర్వహించాయి. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ ఉద్యోగాలు దొరకడం కష్టమైన పరిస్థితుల్లో ఉపాధి కల్పనకు కంపెనీలు మన ప్రాంతానికి రావడం మంచి పరిణామమన్నారు. ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎం.రవి మాట్లాడుతూ ఎక్కువ మందికి ఉద్యోగాలు ఇవ్వాలనే ఉద్దేశంతో మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమర్థనం ముఖ్యుడు సతీష్ మాట్లాడుతూ చదువుకునే సమయంలో ఏదైనా ఆసక్తి ఉన్న వృత్తిలో నైపుణ్యాలు పెంచుకోవాలని సూచించారు. తద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. 25 కంపెనీల ప్రతినిధులు మేళాలో అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అధ్యాపకులు ప్రాణేష్ కులకర్ణి, మహంతేష్ అంగడి, శివరాజప్ప పాల్గొన్నారు. జిల్లా నలు మూలల నుంచి నిరుద్యోగులు తరలివచ్చారు.

వీడని ముడా నీడ

● కొనసాగిన సోదాలు, విచారణ

మైసూరు, న్యూస్‌టుడే : మైసూరు అభివృద్ధి ప్రాధికార (ముడా)లో అక్రమాలపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారుల సోదాలు శనివారం నాడూ కొనసాగాయి. శుక్రవారం ఉదయం నుంచి అర్ధ రాత్రి వరకు సోదాలకు కాస్త విరామం ఇచ్చి.. శనివారం వేకువ జాము నుంచే మళ్లీ పని మొదలుపెట్టారు. వివిధ విభాగాల ఉద్యోగులు, అధికారుల విచారణ కొనసాగించారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య భార్యకు ఆమె సోదరుడు మల్లికార్జున స్వామి పసుపు కుంకుమ కింద భూమిని అప్పగించడం, అంతకు మునుపు భూమి యజమాని దేవరాజ్ తన పొలాన్ని విక్రయించడం, తనకు వచ్చిన భూమిని ముడాకు పార్వతి అందించడం తదితరాలకు సంబంధించిన దస్త్రాలను ప్రత్యేకంగా పరిశీలించారు. భూమి విక్రయించిన దేవరాజ్‌ను సుదీర్ఘంగా ప్రశ్నించారు. చివరకు ఆయనకు కరచాలనం చేసి పంపించారు. కొన్ని దాఖలాలను వైట్‌నర్‌తో సరిదిద్ది ఉన్నట్లు ఈడీ అధికారులు గుర్తించారు. ముడా కమిషనర్ రఘునందన్ నుంచి అధికారులు వివరణ తీసుకున్నారు. ముడాలో 1992వ ఏడాదికి సంబంధించిన కొన్ని దస్త్రాలు మాయం అయినట్లు గుర్తించారు. ముడాలో అక్రమాలపై చేపట్టిన దర్యాప్తు, ఇంటి స్థలాల కేటాయింపునకు సంబంధించి 41 ప్రశ్నలను రఘునందన్‌పై సంధించారు. పార్వతికి కేటాయించిన 14 ఇంటి స్థలాలపైనే ఎక్కువ ప్రశ్నలు అడిగారని సమాచారం.



ముడా కార్యాలయం ముంగిట తనిఖీలు



కార్యాలయ ప్రధాన భవంతి వద్ద భద్రత



గోడపై చిత్రాన్ని పూర్తి చేస్తున్న కళాకారుడు

'కుడ్య' కళాతరంగాలు

● 'గోడె బెంగళూరు' షురూ

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : ఉద్యానగరిలోని పలు ప్రాంతాల్లో గోడలను సుందరంగా మార్చివేసేందుకు అన్‌బాక్సింగ్ ఫౌండేషన్, బీఎంఆర్‌సీఎల్ సంస్థలు ముందుకు వచ్చాయి. 'గోడె బెంగళూరు' పేరిట నగర సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలు, పండగలు, కళ తదితరాలను ప్రతిబింబించే చిత్రాలను మెట్రో స్టేషన్లు, మెట్రో రైలు కొనసాగే మార్గంలోని రహదారుల్లోని గోడలపై చిత్రించనున్నారు. ఈ చిత్రాలను పూర్తి చేయడంతో పాటు నవంబరు 30 నుంచి డిసెంబరు 15 వరకు 'బెంగళూరు హబ్బ'ను ఆరంభించేందుకు అన్‌బాక్సింగ్ ఫౌండేషన్ సన్నాహాలు చేసుకుంటోంది. పది మంది కళాకారులు తమ సహాయకులతో కలిసి బొమ్మలు వేయడాన్ని ప్రారంభించారు. వీరు వేస్తున్న చిత్రాలను సురేశ్ జయరామ్, అర్చన హండె, రవికుమార్ కాశి పర్యవేక్షిస్తున్నారు. ఉత్తమ చిత్రాలు వేసిన కళాకారులను 'బెంగళూరు హబ్బ' సమయంలో సత్కరిస్తామని ఫౌండేషన్ ప్రతినిధి కామిని సాహ్నీ తెలిపారు. గోడలు సుందరంగా ఉంటే, పాదచారులు, నగరానికి వచ్చే పర్యాటకులకు చక్కని అనుభూతిని ఈ చిత్రాలు అందిస్తాయని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

ఆయుర్వేద కళాశాల వద్ద విద్యార్థుల ఆందోళన

మాన్వి, న్యూస్‌టుడే : స్థానిక కేపీఎస్‌వీఎస్ ఆయుర్వేద వైద్య కళాశాల యాజమాన్యం ప్రవర్తన, సదుపాయాల కొరతను నిరసిస్తూ వైద్య కళాశాల విద్యార్థులు ఆందోళనకు దిగారు. ఇతర రాష్ట్రాలు, జిల్లాల విద్యార్థులు సాయంత్రం కళాశాల ఎదుట, రాత్రి క్యాంటీన్ ఎదుట నిరసన చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ కళాశాలలో కనీస సౌకర్యాలు లేవని, తాగేనీరు కూడా తామే తెచ్చుకుంటున్నామని ఆరోపించారు. వాయిదా పద్ధతుల్లో కళాశాల రుసుములు చెల్లించమని చెప్పారని, ఇప్పుడు వడ్డీ కట్టమంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాతపూర్వకంగా ఇవ్వాలని విద్యార్థులు డిమాండ్ చేస్తే పట్టించుకోలేదన్నారు. కళాశాలలో వైద్యుల కొరత ఉందన్నారు. వైఫల్యాలను ప్రశ్నిస్తే హాజరుశాతం తక్కువగా ఉందని రూ.5 వేల నుంచి 50 వేలు వరకు చెల్లించాలని కళాశాల యజమాన్యం డిమాండ్ చేస్తోందని ఆరోపించారు. సంతకాల కోసం వెళ్లే విద్యార్థులతో నిర్వాహకుడు అనుచితంగా వ్యవహరిస్తున్నాడని తెలిపారు. విద్యార్థుల ఆందోళన విషయాన్ని తెలుసుకున్న పోలీసులు కళాశాలకు వచ్చి విద్యార్థులతో చర్చించారు. ఎస్సై వీరనగౌడ విషయాన్ని శిక్షణ సంస్థ అధ్యక్షుడు కల్మఠ స్వామీజీకి తెలియచేశారు. ఆయన వచ్చి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు చేసిన ఆరోపణలేవీ తనకి తెలియవని, దీనిపై విచారించి తప్పిదాలకు పాల్పడిన కళాశాల పరిపాలనాధికారి, నిర్వాహకుడిపై చర్యలు తీసుకుంటానని, విద్యార్థులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థులు నిరసన విరమించారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కల్మఠ స్వామీజీ





సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు, మాట్లాడుతున్న వీరేశ్

పోరాటాలకు సిద్ధం కావాలి

రాయచూరు, న్యూస్‌టుడే : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని, రెండు ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాటానికి సన్నద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వీరేశ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. లింగసుగూరు తాలూకాలో శనివారం జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ పెరుగుతున్నా ప్రభుత్వాలు పట్టించు కోవడం లేదని, లాభాల్లో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడం వల్ల నిరుద్యోగం పెరిగిందని విమర్శించారు. వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు లభించక రైతులు అప్పులపాలవుతున్నా ప్రభుత్వాల్లో చలనం లేదన్నారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు షబ్బీర్ మాట్లాడుతూ దేశంలో పేద ప్రజల కష్టాలను మోదీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తాలూకా కార్యదర్శి రమేశ్ వీరాపుర, నాయకులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



కవలలకు ఉద్యోగ నియామక పత్రాలు అందిస్తున్న కుమారస్వామి



ఉద్యోగాలు దక్కిన యువతతో మాజీ మంత్రులు, నేతలు, కుమారస్వామి

తదుపరి ముఖ్యమంత్రి నేనే!

● కుమారస్వామి విశ్వాసం

మండ్య, న్యూస్‌టుడే : 'చూస్తూ ఉండండి.. తదుపరి ముఖ్యమంత్రిని నేనే. నేను జోతిష్యుడిని కాదు. అయినా. చెబుతాను. ప్రజలందరూ కోరుకుంటే ముఖ్యమంత్రిని ఎందుకు అవ్వను? నాకూ ముఖ్యమంత్రిగా ఐదేళ్లు అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరుతా..' అని మాజీ ముఖ్యమంత్రి, కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి వ్యాఖ్యానించారు. 'మండ్య టూ ఇండియా' పేరిట నిర్వహించిన ఉద్యోగమేళా ముగింపు కార్యక్రమంలో ఉద్యోగాలు లభించిన కొందరు యువతకు శనివారం సాయంత్రం నియామక పత్రాలు అందజేశారు. శిరూరులో కొండ చరియలు కూలి చనిపోయిన హోటల్ యజమాని జనార్దన నాయక్ కుమార్తె కృతికా నాయక్‌కు బీహెచ్ఈఎల్‌లో ఉద్యోగాన్ని ఇప్పించారు. కవలలు నవ్య- నందితకు టాటా మోటార్స్‌లో ఉద్యోగం లభించింది. దివ్యాంగుడు అజయ్ కుమార్‌కు అలోరికా గ్లోబల్ బీపీఓలో ఉద్యోగం లభించింది. వారికి నియామకపత్రాలు వితరణ చేశిక.. విలేకరులతో మాట్లాడారు. భాజపాకు రెండు నియోజకవర్గాలు విడిచి పెట్టామని, తమ పార్టీకే చెన్నపట్టణను కేటాయించాలని కోరుతున్నామని చెప్పారు. భాజపా ఆశీస్సులతోనే కుమారస్వామి రాజకీయాల్లో కొనసాగుతున్నారని బసనగౌడ పాటిల్ యత్నాళ్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ఆయన మాటలను తనతో పాటు భాజపా కూడా పట్టించుకోవడం లేదని ఎద్దేవా చేశారు. పేదలు, మహిళలు స్వయం ఉపాధి కల్పించుకునేందుకు అవకాశం కల్పించవలసిన ప్రభుత్వం గ్యారంటీల పేరిట వారిని శక్తిహీనులను చేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో ప్రభుత్వాన్ని కూలదోయవలసిన అవసరం లేదని, కాంగ్రెస్‌లో పలువురు ఎమ్మెల్యేలు ప్రభుత్వ పాలనపై సంతృప్తిగా లేరని వ్యాఖ్యానించారు.

బన్నేరుఘట్టకు తెల్లపులి!

బెంగళూరు (కెంగేరి), న్యూస్‌టుడే : రాజధాని నగర శివారు బన్నేరుఘట్ట జీవ ఉద్యానవనానికి కొత్త అతిథులు విచ్చేశాయి. కేంద్ర మృగాలయ ప్రాధికార ప్రాణుల వినిమయం పథకంలో భాగంగా పాట్నా మృగాలయం నుంచి రెండు మొసళ్లు, ఆరేళ్ల తెల్లపులి, అడవి పిల్లి ఇక్కడికి చేరుకున్నాయి. ఐదు రోజుల ప్రయాణం తర్వాత ఆ వన్యప్రాణులు ఉద్యాననగరంలో కాలుమోపాయి. వీటికి ప్రత్యామ్నాయంగా పాట్నాకు జీబ్రా, థమిన్ జింకలను పంపించారు. జంతువుల సరఫరా సమయంలో సంబంధిత వాహనానికి తెలంగాణ పరిధిలో ప్రమాదం వాటిల్లినా.. ఎలాంటి నష్టం కలగలేదు. అరణ్యాధికారులు సురక్షితంగా వాటిని తరలించుకొచ్చారు. వీటిని ముందు జాగ్రత్తగా 45 రోజుల పాటు క్వారంటైన్‌లో ఉంచారు. ఇక్కడి వాతావరణానికి అలవాటు పడ్డాక.. సందర్శకులు వీక్షించేందుకు అవకాశం కల్పిస్తారు.



తెల్లపులి



మొసలి

వర్గీకరణ సాధ్యమేనా?

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : రాష్ట్రంలో షెడ్యూల్డు కులాల రిజర్వేషన్ వర్గీకరణ అమలు సాధ్యతపై ముఖ్యమంత్రి సిద్ధరామయ్య శనివారం సంబంధిత మంత్రులు, శాసనసభ్యులతో ప్రత్యేకంగా సమావేశమై చర్చించారు. రాష్ట్రంలో ఈ రిజర్వేషన్‌ను వర్గీకరించాలనే ఒత్తిడి ఎదురవుతోన్న క్రమంలో సమావేశానికి ప్రాధాన్యమేర్పడింది. ఆగస్టు ఒకటో తేదీ సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు, జస్టిస్ సదాశివ కమిషన్ నివేదిక, కులాల సర్వే తదితర అంశాలూ చర్చకు వచ్చాయి. రిజర్వేషన్లను ఎలా వర్గీకరించాలని, దాని వల్ల లాభనష్టాలనూ సీఎం విశ్లేషించారు. సమావేశంలో మంత్రులు కె.హెచ్. మునియప్ప, ఆర్.బి.తిమ్మాపుర, మాజీ ఎంపీ డాక్టర్ ఎల్.హనుమంతయ్య, మాజీ మంత్రులు హెచ్.ఆంజనేయ, శివణ్ణ, శాసనసభ్యులు బసంతప్ప, డాక్టర్ తిమ్మయ్య, ముఖ్యమంత్రి రాజకీయ కార్యదర్శి నసీర్ అహ్మద్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలిని రజనీశ్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణపై మంత్రులు, శాసనసభ్యులతో సమావేశమైన ముఖ్యమంత్రి సిద్ధరామయ్య

సిద్ధు.. జగమొండి

విజయేంద్ర అసహనం

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మొండితనాన్ని వీడి లోకాయుక్త అధికారుల విచారణకు హాజరవ్వాలని భాజపా రాష్ట్రాధ్యక్షుడు బీవై విజయేంద్ర హితవు పలికారు. దిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ అధ్యక్షుడు కేజ్రీవాల్ ఇలానే మొండిగా వ్యవహరించి, చివరకు కారాగారానికి వెళ్లవలసి వచ్చిందని గుర్తు చేశారు. భాజపా ప్రధాన కార్యాలయం 'జగన్నాథ భవన్'లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తనకు కాంగ్రెస్ అధిష్ఠానం మద్దతు ఉందని భావిస్తూ, ముఖ్యమంత్రి పీఠాన్ని అంటిపెట్టుకుని ఉన్నారని తప్పుబట్టారు. మైసూరు నగరాభివృద్ధి సంస్థ (ముడా) అక్రమాలకు సంబంధించిన విచారణను చేపట్టేందుకు చట్టసభ ప్రతినిధుల న్యాయస్థానం, ఉన్నత న్యాయస్థానంలో న్యాయమూర్తులు ఇచ్చిన ఆదేశాలను ఒకసారి క్షుణ్ణంగా చదువుకుంటే, ఒక్క క్షణం కూడా ఆయన పదవిలో కొనసాగరని వ్యాఖ్యానించారు. ముడాలో అక్రమాలే జరగలేదని ఒకసారి, తాను రాజీనామా చేయవలసిన అవసరం లేదని మరోసారి చెబుతున్నారని నిందించారు. తనను తాను నిర్దోషి అని ఆయనే ప్రమాణ పత్రాన్ని ఇచ్చుకోవడం హాస్యాస్పదమని వ్యాఖ్యలు చేశారు. కూటమి తరఫున చెన్నపట్టణలో ఎవరు ఎమ్మెల్యేగా నిలుస్తారనే అంశమై కేంద్ర మంత్రి కుమారస్వామి, పార్టీ నాయకులతో విస్తృతంగా చర్చిస్తున్నామని తెలిపారు. సోమవారం నాటికి మూడు నియోజకవర్గాల్లో పోటీ చేసే అభ్యర్థుల విషయంలో ఒక స్పష్టత వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.



విలేకరులతో మాట్లాడుతున్న విజయేంద్ర

'దస్త్రాలు కాల్చేసిన సురేశ్'

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : ముడాలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు చెందిన అక్రమాలు బయటకు రాకుండా చేసేందుకు నగరాభివృద్ధి శాఖ మంత్రి భైరతి సురేశ్ కొన్ని దాఖలాలను తీసుకువచ్చి, కాల్చివేశారని కేంద్ర మంత్రి శోభా కరంద్లాజె ఆరోపించారు. ఈడీ అధికారులు తక్షణమే ఆయనను అరెస్టు చేసి విచారించాలని డిమాండ్ చేశారు. భాజపా ప్రధాన కార్యాలయం 'జగన్నాథ భవన్'లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. ముడా ప్రధాన కార్యాలయంలో ఈడీ సోదా చేసిన సమయంలో నాలుగేళ్ల దస్త్రాలు కనిపించలేదన్నారు. సురేశ్ స్వయంగా 'ముడా' కార్యాలయానికి వెళ్లి కొన్ని దస్త్రాలు తీసుకువచ్చి కాల్చి వేశారని ఆరోపించారు. అవినీతి ఆరోపణల నేపథ్యంలో నైతిక బాధ్యత వహించి ముఖ్యమంత్రి పదవికి సిద్ధరామయ్య తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ముడాలో పెద్ద అవినీతి తిమింగలాలు ఉన్నాయని విమర్శించారు. ముఖ్యమంత్రి కుమారుడు, ఎమ్మెల్సీ డాక్టర్ యతీంద్ర అందులో సభ్యుడిగా ఉన్నారని, ఆయనే ప్రభావాన్ని చూపించి పలువురికి ఇళ్ల స్థలాలను అక్రమమార్గంలో ఇప్పించారని ఆరోపించారు. తీసుకున్న ఇంటి స్థలాలను వెనక్కు ఇచ్చేస్తే నేరం మాఫీ అవుతుందా? అని ప్రశ్నించారు. ముడాలో అక్రమాలు జరిగి ఉండకపోతే దాని అధ్యక్షుడు మరిగౌడ ఎందుకు రాజీనామా చేశారో చెప్పాలని పట్టుబట్టారు. ఆ సంస్థ కార్యదర్శిని ఎందుకు సస్పెండ్ చేశారని ప్రశ్నల వర్షాన్ని కురిపించారు. తనపై ఉన్న కేసులు, ఆరోపణలపై విచారణ జరగకూడదని గతంలో లోకాయుక్తను మూసివేసి, అనిదను సిద్ధరామయ్య ప్రారంభించారని ఆరోపించారు.



విలేకరులతో మాట్లాడుతున్న శోభా కరంద్లాజె

కోడికత్తితో భార్య గొంతుకోసి..

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : భార్య నడవడికను అనుమానించి కోళ్లను కోసే కత్తితో గొంతుకోసి హత్య చేసి పరారైన శ్రీనివాస్ (52)ను బాగలూరు ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. యలహంక తాలూకా, బూదిగెరె సమీపంలోని సింగహళ్లిలో కోడిమాంసం విక్రయించుకునే దుకాణాన్ని శ్రీనివాస్ నిర్వహించేవాడు. శుక్రవారం రాత్రి భార్య సుధ (50)ను హత్య చేసి పరారయ్యాడు. అతని కుమారుడు అర్జున్ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కార్యాచరణ నిర్వహించి హంతకుడ్ని అరెస్టు చేసి విచారణ చేపట్టారు.

ఇద్దరు కారాగారాధికారులపై వేటు

కలబురగి, న్యూస్‌టుడే: కలబురగి కారాగారంలో ఒక ఖైదీకి చరవాణిని అందించిన ఆరోపణలు రుజువు కావడంతో శహనాజ్, పాండురంగ హరవాళ అనే జైలర్లను సస్పెండ్ చేస్తూ కారాగార శాఖ ఏడీజీపీ మాలిని కృష్ణమూర్తి ఆదేశాలు జారీ చేశారు. కారాగారం నుంచి బయటి వ్యక్తులకు ఫోన్ చేసి నగదు కోసం బెదిరించడం, హనీట్రాప్‌ను చేయిస్తున్న ఆరోపణలపై కారాగారంలో చేసిన సోదాల్లో ఫోను దొరికింది. ఖైదీని విచారణ చేయగా.. తనకు అది ఎలా వచ్చిందో చెప్పడంతో, వారిద్దరినీ సస్పెండ్ చేసి, విచారణకు ఆదేశించారు.

దారిదోపిడీ దారులపై ప్రతిదాడి

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : మెట్రో రైలు దిగి, ఫోన్‌లో స్నేహితునితో మాట్లాడుకుంటూ వెళుతున్న అభిజిత్ అనే టెకీని దోచుకునేందుకు శుక్రవారం రాత్రి విఫలయత్నం జరిగింది. ఒకే బైకులో వచ్చిన ముగ్గురు ఆగంతకులు అభిజిత్‌పై దాడి చేసి, అతని చరవాణిని లాక్కొనేందుకు ప్రయత్నించారు. వారిపై ప్రతిదాడికి దిగడంతో నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. బాధితుని ఫిర్యాదు మేరకు గోవిందరాజ నగర ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఇథనాల్ ట్యాంకర్ బోల్తా

దావణగెరె, న్యూస్‌టుడే : ముంబయి నుంచి బెంగళూరుకు వస్తున్న ఇథనాల్ నింపిన ట్యాంకర్ దావణగెరె శివార్లలో శనివారం ఉదయం బోల్తా కొట్టింది. ట్యాంకర్ క్యాబిన్ నుంచి బయటకు దూకి డ్రైవరు ప్రాణాలు దక్కించుకున్నాడు. సకాలంలో అక్కడకు చేరుకున్న సిబ్బంది ట్యాంకర్ నుంచి లీకవుతున్న ఇథనాల్‌ను నిలిపి ప్రమాదాన్ని తప్పించారు. క్రేన్ సహాయంతో ట్యాంకర్‌ను మళ్లీ రహదారిపైన నిలిపారు. దావణగెరె గ్రామీణ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా కాపాడాలి

రాయచూరు, న్యూస్‌టుడే : గ్రామ పంచాయతీ పరిధి లెక్కాధికారులు చొరవ తీసుకుని ప్రభుత్వ భూమి కబ్జా కాకుండా రక్షించాలని కర్ణాటక భూకబలిక నిషేధ ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి బి.ఎ.పాటిల్ తెలిపారు. భూకబలిక నిషేధ చట్టంపై శనివారం ఇక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రెవెన్యూశాఖ అన్ని శాఖలకు మాతృ శాఖ అని, ఆ శాఖపై ఎంతో బాధ్యత ఉందన్నారు. రాష్ట్రంలో శ్మశానానికి స్థలం కేటాయించలేని పరిస్థితి ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కడైనా ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైతే ప్రజలు సైతం ఫిర్యాదు చేయాలన్నారు. జిల్లా పాలనాధికారి నితీశ్ మాట్లాడుతూ ఇలాంటి సదస్సు తొలిసారిగా నిర్వహించడం హర్షణీయమని, ప్రజలు సహకరించేలా వారికి అవగాహన కలిగించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి మారుతి, అధికారులు పాల్గొన్నారు.



వేదిక మీద ఆసీనులైన పాటిల్ తదితరులు



హాజరైన వివిధ శాఖల అధికారులు

సముదాయ నిర్మాణం పూర్తి చేస్తాం

మాన్వి, న్యూస్‌టుడే : మధ్యలో నిలిపివేసిన నిర్మాణం పనులను త్వరలో పూర్తి చేయిస్తామని ఎమ్మెల్యే హంపయ్యనాయక్ బరోసా ఇచ్చారు. చాగభావి గ్రామ పంచాయతీ పరిధిలోని లక్కందిన్ని గ్రామంలో శివమూర్తి శివాచార్య స్వామీజీ పుణ్యస్మరణ, జాతరలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. స్వామి మహిమాన్వితుడని, ఆయనను కలిసే మాట్లాడే అవకాశం తనకు దక్కిందన్నారు. ఈ గ్రామంలో సముదాయ భవనం నిర్మాణం కోసం గతంలో రూ.10 లక్షలు విడుదల చేసామని, గుత్తేదారు మధ్యలోనే పనులు నిలిపివేశారన్నారు. నిర్మాణాన్ని త్వరలో పూర్తి చేయిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రముఖులు వై.శరణయ్యానాయక్, రమేశ్‌దర్శనకర్, ఎం.శ్రీనివాస్, బసవరాజ్, గ్రామ పంచాయతీ సభ్యులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే నాయక్, తదితరులు

ఘనంగా ఉచ్చాయం: జాతర సందర్భంగా భక్తులు శివాచార్య ఉచ్చాయ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ వీధుల్లో ఉచ్చాయాన్ని ఊరేగించారు. జాలాపూరు, భాగ్యనగర్, చాగభావి, మాడగిరి, హోసూరు తదితర గ్రామాల నుంచి స్వామీజీ భక్తులు, అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

19-10-2024 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1631.91	1612.57
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	73,241	228
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	74,025	10,505
నీటి నిల్వ (టి.ఎం.సి)	101.421	42.897

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

అంజలి కుటుంబానికి సాయం

హుబ్బళ్లి, న్యూస్‌టుడే : తనకు పరిచయం ఉన్న గిరీశ్ సావంత అనే యువకుని చేతిలో గత మే నెల 15న హత్యకు గురైన యువతి అంజలి అంబిగెరె (20) కుటుంబానికి ప్రభుత్వం రూ.5 లక్షల పరిహారాన్ని అందజేసింది. ధార్వాడ జిల్లాధికారి ఖాతాకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి పరిహారాన్ని విడుదల చేశామని ముఖ్యమంత్రి కార్యదర్శి టీపీ గోపాల్ తెలిపారు.

భరత్‌కు టికెట్ ఏల?

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : శిగ్గావ్ ఉప ఎన్నికల టికెట్ మా అబ్బాయి భరత్ బొమ్మైకు ఇవ్వవద్దని మాజీ ముఖ్యమంత్రి, ఎంపీ బసవరాజ బొమ్మై పార్టీ నాయకులకు తేల్చి చెప్పారు. ఆయన విన్నపాన్ని పార్టీ నాయకులు పరిగణనలోకి తీసుకోలేదు. శిగ్గావ్‌కు భరత్ బసవరాజ బొమ్మైను, సండూరుకు బంగారు హనుమంతును అభ్యర్థిగా శనివారం రాత్రి హస్తినలో ప్రకటించారు. బొమ్మై దిల్లీలో విలేకరులతో శనివారం మాట్లాడుతూ, ఇప్పటి ఎన్నికల్లో భరత్‌ను పోటీలో దించాలని నియోజకవర్గంలోని కార్యకర్తలు ఒత్తిడి చేస్తున్నారని చెప్పారు. ఈసారి ఉప ఎన్నికలు జరిగే మూడు ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా భాజపా, జనతాదళ్ కార్యకర్తలు శ్రమిస్తారని తెలిపారు. తన వ్యక్తిగత విన్నపాన్ని పరిగణనలోకి తీసుకుని సీటు ఇవ్వవద్దని పార్టీ నాయకులను కోరానని, తప్పదంటే అతని గెలుపు కోసం కార్యకర్తగా శ్రమిస్తానని చెప్పారు.

గ్రామాల్లో ఆరోగ్య బృందాలు

మాన్వి, న్యూస్‌టుడే : గ్రామ పంచాయతీ స్థాయిలోనే ఆరోగ్య సేవలను అందించేందుకు గ్రామ ఆరోగ్య బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు తాలూకా ఆరోగ్య శిక్షణాధికారి బాలప్పనాయక్ పేర్కొన్నారు. తాలూకాలోని నీరమాన్వి గ్రామంలో తాలూకా ఆరోగ్య శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రామ ఆరోగ్య శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు, జీపీ సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలతో బృందాలను ఏర్పాటు చేసి వారికి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అభివృద్ధి శాఖ అధికారిణి సరితా, జీపీ కార్యదర్శి మల్లికార్జున, సముదాయ ఆరోగ్య అధికారి హుసేనమ్మ, ప్రాథమిక ఆరోగ్య సురక్ష అధికారిణి చంద్రిక, ఆరోగ్య నిరీక్షణాధికారి విశ్వనాథ్, జీపీ సభ్యులు పాల్గొన్నారు.

అధ్యాపకుల సంఘం నూతన కార్యవర్గం

మాన్వి, న్యూస్‌టుడే : తాలూకా ప్రైవేట్ కళాశాలల అధ్యాపకుల సంఘానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. శనివారం స్థానిక గాంధీ కళాశాలలో సమావేశం నిర్వహించారు. సంఘం గౌరవాధ్యక్షుడిగా ఈరణ్ణ మర్లట్టి, అధ్యక్షుడుగా ఆంజనేయ నస్లాపూర్, ప్రధాన కార్యదర్శిగా మహిబూబ్ మద్లాపూర్, ఉపాధ్యక్షులుగా సిద్దనగౌడ, శంకరప్ప నక్కుంది, శరణబసవ సీకల్, దేవరాజ్ పోత్నాళ, మహిళా ప్రతినిధిగా సుజాత శ్రీనివాస్, కోశాధికారిగా వీరభద్రయ్యస్వామి, సంఘటనా కార్యదర్శులుగా హనుమంత యడివాళ, హనమంతరాయ ఎన్నికయ్యారు.



సంఘం నూతన సభ్యులు